ధర్మఘంట
జాతీయ తెలుగు దినపత్రిక
TELTEL/2012/47103

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 277 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | శనివారం 3 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### మూడేళ్ల కనిష్టానికి రష్యా ముడి చమురు దిగుమతులు

రష్యాకు చెందిన సంస్థలపై అమెరికా తాజా ఆంక్షల నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబర్ నెలలో ఆ దేశం నుంచి చమురు దిగుమతులు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ ప్రకారం, భారత్‌లోకి రష్యా ముడి చమురు దిగుమతులు డిసెంబర్‌లో రోజుకు దాదాపు 1.2 మిలియన్(12 లక్షల) బ్యారెళ్లకు (బీపీడీ) తగ్గుతాయని అంచనా.

### తగ్గిన ఎటిఎంలు

బ్యాంక్‌లు ఎటిఎం కేంద్రాల సంఖ్యను కుదిస్తోన్నాయి. రిజర్వు బ్యాంక్ సమాచారం మేరకు.. ఆర్థిక సంవత్సరం 2024-25లో బ్యాంక్‌లు శాఖలను పెంచుకోగా.. మరోవైపు ఎటిఎం కేంద్రాలను మాత్రంగా తగ్గించుకున్నాయి. 2025 మార్చి 31 నాటికి దేశవ్యా ప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల ఎటిఎంలు 2,51,057కి తగ్గాయి. అంతక్రితం ఏడాది 2,53,417గా ఉన్నాయి. పలు ప్రభుత్వరంగ బ్యాంకులు విలీనం కావడంతో వీటి సంఖ్య తగ్గిపోయాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.



## నీరు కాదు విషాన్ని పంచారు

- ఇండౌర్‌లో మరణాలపై రాహుల్ ఆందోళన
- రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోంది
- కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొంది
- పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారు

# మూసీకి మహర్దశ

- రూపురేఖలు మార్చే బృహత్ ప్రణాళిక ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వ కార్యాచరణ.. మార్చి 31 డెడ్‌లైన్
- ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4 వేల కోట్ల రుణం.. గోదావరి జలాల తరలింపు
- గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటుకు ప్రణాళిక
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



హైదరాబాద్

హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన మూసీ నది పునరుజ్జీవనంపై తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మార్చి 31వ తేదీలోగా ప్రాజెక్టు అంచనాలు పూర్తి చేసి, టెండర్లు పిలవడం ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై జోక్యం చేసుకున్న సీఎం, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రభుత్వ విస్తృత లక్ష్యాలను, ప్రణాళికలను సభ్యులకు వివరించారు. ఈ బృహత్ ప్రాజెక్టు కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రూ.4 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించిందని, కేంద్రం నుంచి కూడా అవసరమైన అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నుంచి 20 టీఎంసీల నీటిని తరలించి, అందులో 15 టీఎంసీలను నగర తాగునీటి అవసరాలకు, మిగిలిన 5 టీఎంసీలతో మూసీలో నిరంతరం శుద్ధమైన నీరు ప్రవహించేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టులో భాగంగా గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు సీఎం చెప్పారు. దీంతో పాటు, బాపూ ఘాట్ వద్ద మూసా-ఈసా నదుల సంగమ ప్రదేశంలో 'ఎ' ఆకారంలో 'గాంధీ సరోవర్' అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడే ప్రపంచంలోనే అత్యంత - మిగతా3లో

## కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న నేతలను దూరం చేసేలా కవిత మాట్లాడుతున్నారు

- కవిత ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారా లేదా అనే విషయం వెల్లడించాలన్న మంత్రి
- కేసీఆర్‌ను విమర్శిస్తే స్పందించిన కవిత, హరీశ్ రావుపై విమర్శలకు స్పందించలేదని వ్యాఖ్య
- కేసీఆర్ వదిలిన రాజకీయ బాణంగా కవిత ఉన్నారన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్

కవిత ప్రస్తుతం కేసీఆర్‌కు సన్నిహితంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులందరినీ దూరం చేసే ధోరణిలో మాట్లాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కేసీఆర్ రోజూ అసెంబ్లీకి వస్తే బీఆర్ఎస్ పుంజుకుంటుందన్న కవిత వ్యాఖ్యలు ఆమె రాజకీయ భవిష్యత్తను ప్రశ్నార్థకం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కవిత ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారో లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత చేసిన - మిగతా3లో




## ఇక సమయం వచ్చింది

- భారత్ మద్దతు కోరిన బలూచ్ ప్రతినిధి
- విదేశాంగ మంత్రి జైశంకర్‌కు బలూచ్ నేత మీర్ యార్ బలూచ్ బహిరంగ లేఖ
- బలూచిస్థాన్‌లో కొద్ది నెలల్లో చైనా సైన్యాన్ని మోహరిస్తారని హెచ్చరిక
- పాకిస్థాన్ అణచివేతకు వ్యతిరేకంగా భారత్ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి
- 79 ఏళ్లుగా పాక్ అకృత్యాలకు పాల్పడుతోందని లేఖలో ఆరోపణ
- ఈ లేఖపై భారత్, పాకిస్థాన్, చైనాల నుంచి ఇంకా అధికారిక స్పందన

## వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు

తనకు వారాంతపు సెలవులు ఉండవన్న జైశంకర్
సంగీతం, పుస్తకాలు తనకు ప్రశాంతతను ఇస్తాయని వ్యాఖ్య
డిటాక్స్ కావాల్సిన అవసరం తనకు లేదన్న జైశంకర్



## మేం మాట్లాడితే బెల్లు కొడుతున్నారు

- షేర్వాణీలు వేసుకుని వస్తే మీరు బెల్లు కొట్టడం లేదు: అసెంబ్లీలో నవ్వులు పూయించిన బీజేపీ ఎమ్మెల్యే
- మేం కూడా షేర్వాణీ వేసుకుని వస్తామని ప్రభుత్వానికి చురక
- కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ అని సీఎం చెప్పారని గుర్తు చేసిన ఎమ్మెల్యే



హైదరాబాద్

బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "అధ్యక్షా, మేం మాట్లాడితే బెల్లు కొడుతున్నారు. కానీ మా పక్కనున్న షేర్వాణీ వేసుకున్న మిత్రులు మాట్లాడితే మాత్రం ఏ రోజు బెల్లు కొట్టలేదు. అలా అయితే మేమూ షేర్వాణీలు వేసుకుని వస్తాం" అంటూ సభలో హాస్యాన్ని పండించారు. కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని, - మిగతా3లో



## ఆర్థిక సంక్షోభం... ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్

- ఇరాన్‌లో నిరసనకారుల పట్ల భద్రతా దళాలు వ్యవహరిస్తున్న తీరుపై ట్రంప్ ఆగ్రహం
- శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిపై కాల్పులు జరపవద్దన్న ట్రంప్
- వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని హెచ్చరిక
- ట్రంప్ జోక్యంపై తీవ్రంగా స్పందించిన ఇరాన్ సుప్రీం లీడర్ సీనియర్ సలహాదారు

## చైనా మాంజాతో ముంచుకొస్తున్న ప్రమాదం



- అప్రమత్తంగా లేకుంటే గాల్లోకి ప్రాణం!
- నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా విక్రయాలు
- ద్విచక్ర వాహనదారుల మెడకు చుట్టుకుని ప్రమాదం
- పక్షులకు కూడా తప్పని ముప్పు- ఈ సమయం కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి
- ప్రమాదకరమైన వాటితో తయారైన మాంజా

హైదరాబాద్

జనవరి నెల వచ్చేసింది. ఇక అందరూ రానున్న సంక్రాంతి పండగ గురించి ఏర్పాట్లు చేయడం మొదలుపెట్టారు. ముఖ్యంగా సంక్రాంతి అనగానే పిల్లలకు ముందుగా గుర్తుకు వచ్చేది వాళ్లు ఎంతో సరదాగా ఎగురవేసే గాలిపటాలు. అందుకే జనవరి నెల మొదలవగానే గాలిపటాలతో పిల్లలు సిద్ధంగా ఉంటారు. అంతే కాకుండా గాలి పటాలను ఎగురవేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఎంతో సరదాగా ఆడుకునే ఈ ఆటలో ఇంకా ఎన్నో ప్రమాదాలు కూడా దాగి ఉన్నాయి. పండగ వేళల్లో సందడిగా ఉండాల్సిన కొందరి ఇళ్లు విషాదంగా మారుతున్నాయి. దానికి కారణం గాలిపటాలు ఎగురవేసేందుకు ఉపయోగించే చైనా మాంజా దారం. చైనా మాంజా పంజా విసురుతోంది. నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. చాలామంది వాటి బారిన పడుతున్నారు. మేడలు, అపార్ట్‌మెంట్లపైకి వెళ్లి పతంగులను ఎగురవేస్తుండగా - మిగతా3లో

## ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీల కోసం ప్రత్యేక కమిటీ



- ఏపీ, తెలంగాణ మధ్య నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్రం కమిటీ
- సీడబ్ల్యూసీ ఛైర్మన్ నేతృత్వంలో పనిచేయనున్న నిపుణుల బృందం
- గతేడాది జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం
- కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 గడువును పొడిగించిన కేంద్రం
- పెండింగ్ ప్రాజెక్టులు, నీటి పంపిణీపై కమిటీ సమగ్ర అధ్యయనం

## సంపాదకీయం

# అమెరికా విశ్వసించదగ్గ దేశమేనా!

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండే అమెరికాతో భారత్‌కు ఏనాడూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పలేం. భారత్ రష్యాకు దగ్గరవడంతో కేవలం చైనాను కట్టడిచేసేందుకు ఒక పావుగా భారత్‌ను ఉపయోగించుకొనే ప్రయత్నం తప్ప భారతదేశ ప్రయోజనాలపట్ల ఆ దేశానికి ఏనాడూ ఆసక్తి లేదు. పైగా, వ్యూహాత్మక, రక్షణ అవసరాలరీత్యా పాకిస్థాన్‌తో అంటకాగుతూ వస్తుంది. మొదటిసారిగా, అణుపరీక్షల అనంతరం ఆంక్షలను సైతం లెక్కచేయకుండా కార్గిల్ యుద్ధం సందర్భంగా అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి వాజపేయి ప్రభుత్వం అంతర్జాతీయంగా పాకిస్థాన్‌ను ఒంటరి చేయగలిగింది. అమెరికాతో వ్యూహాత్మక సంబంధాల పెంచుకునేందుకు మార్గం ఏర్పచింది. అయితే, మోడీ హయాంలో ఆ ప్రయత్నాలకు గండిపడిందా? అనే అనుమానం కలుగుతుంది. 2025లో జరిగిన పరిణామాలే అందుకు నిదర్శనం. దౌత్యపరంగా, వాణిజ్య ఒప్పందం విషయంలో ఓ విధంగా భారత్‌ను వణికించిందని చెప్పవచ్చు. ఒక విధంగా గతంలో మరే ప్రధాని ప్రయత్నించని విధంగా అమెరికా అధ్యక్షుడిగా వ్యక్తిగతంగా సాన్నిహిత్యం పెంచుకొనే ప్రయత్నం మోడీ చేశారు. ఆయనకు 'అత్యంత సన్నిహితుడు'గా ప్రచారం పొందిన డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో ఒక విధంగా ఆశావాదంగా ప్రారంభమైన ఈ సంవత్సరం చివరకు ట్రంప్ పేరు చెబితేనే భారతీయులు భయపడే స్థాయికి తీసుకెళ్లింది. 'కొందరి మాదిరిగా కాకుండా, ట్రంప్ నేతృత్వంలోని అమెరికా పరిపాలన గురించి మేము భయపడటం లేదు. ఇద్దరి మధ్య ఒకే విధమైన ఆసక్తులు అనేకం ఉన్నాయి' అంటూ విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ గత జనవరిలో ప్రకటించారు. అయితే, స్వయంగా జైశంకర్ అమెరికా పర్యటనకు వెళ్లి, ఐదు రోజులపాటు ప్రయత్నం చేసినా ట్రంప్ ప్రమాణస్వీకారంకు హాజరయ్యేందుకు ప్రధాని మోడీకి ఆహ్వానం సంపాదింపలేకపోయారు. అధికారంలోకి రాగానే ట్రంప్ ఏకపక్షంగా భారతీయ వస్తువులపై 25% సుంకాలు విధించడం ద్వారా భారతీయులను దిగ్భ్రాంతికి గురిచేశారు. మరి కొన్ని రోజులకే వాటిని 50 శాతంకు పెంచారు. ట్రంప్ సృష్టించిన తుఫాను మన తీరాలను తాకుతుందని మన విదేశాంగ కార్యాలయం ఏమాత్రం ఊహింపలేకపోయింది. ముఖ్యంగా పహల్గామ్ ఉగ్రవాదదాడి తర్వాత ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు భారతీయులను కలవరంకు గురిచేస్తున్నాయి. ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ రూపంలో కొత్తరూపం దాల్చిన మన పాత ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ట్రంప్ దగ్గరకు తీస్తున్న తీరు నమ్మశక్యంగా లేకుండాపోయింది. పహల్గామ్‌కు భారతదేశం సైనికంగా ప్రతీకారం తీర్చుకోకముందే, మునీర్ ట్రంప్ కుటుంబ సంస్థతో భారీ లాభదాయకమైన క్రిప్టోకరెన్సీ ఒప్పందాన్ని తొందరగా కుదుర్చుకున్నాడు. దానితో ట్రంప్ వ్యాపార భాగస్వామి జాచరీ విట్‌కాఫ్ పాకిస్తాన్‌కు ఎగిరి గంతేసాడు. ఆ తరువాత ట్రంప్ మునీర్‌ను గౌరవ అతిథిగా వైట్ హౌస్ లో స్వాగతించడమే కాకూండా, తన గడ్డపై భారతదేశాన్ని నాశనం చేస్తున్నానని గొప్పలు చెప్పుకున్నప్పటికీ, పాకిస్తాన్‌ను చెత్త ట్రక్కుతో, భారత దేశాన్ని మెరిసే మెర్సిడెస్‌తో పోల్చినప్పుడు కూడా అమెరికా నిరసన వ్యక్తం చేయలేదు. ఇండో -పాకిస్తాన్ వివాదాన్ని ముగించినందుకు నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్‌ను నామినేట్ చేస్తున్నట్లు ప్రకటించడం ద్వారా ఆయన హృదయాన్ని మునీర్ నిశ్చయంగా గెలుచుకున్నారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా భారత దౌత్యపరమైన ప్రతిఘటన మీడియా సమావేశాలకు, ప్రకటనలకు మాత్రమే పరిమితమైపోయింది. అందుకు దీటుగా వ్యూహాత్మకంగా తిప్పికొట్టే ప్రయత్నం భారత్ చేయలేకపోయింది. అమెరికాలో ప్రధాని మోడీకి సన్నిహితంగా ఉన్న అనేకమంది బిలియనీర్లు, రాజకీయ-వ్యాపార ప్రముఖులు ఏవ్వరిని ఉపయోగించి ట్రంప్‌ను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరగనేలేదు. మన రాయబారులు, దౌత్యప్రతినిధులు సైతం ట్రంప్ అంతర్గత వలయంలోకి ప్రవేశింపలేకపోతున్నారు. అందుకు విరుద్ధంగా, వైట్ హౌస్‌లో పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ సహచరుడు అరుదైన-భూమి ఖనిజాల పళ్ళెం పట్టుకుని వెళ్ళాడు. వాటిని అమెరికాకు అప్పగించే ప్రతిపాదన చేయడం ద్వారా తిరుగుబాటు ఎదుర్కొంటున్న బలూచిస్తాన్ ప్రాంతంకు అమెరికా సహాయం అందకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు . ఒకప్పుడు అమెరికాలో మన జాతీయ ప్రయోజనాలు కాపాడటంలో క్రియాశీలంగా వ్యవహరించిన ఎన్ఆర్ఐ ప్రముఖులు ట్రంప్ వలసదారులు లక్ష్యంగా చేసుకోవడంలో ఇప్పుడు మౌనం వహిస్తున్నారు. చివరకు వారు భారత దేశప్రయోజనాల గురించి మాట్లాడటమే కాకుండా, సెలవులలో అమెరికాలో విహారయాత్రకు వెళ్లినా తమ విషయాలను ఎక్కడ రద్దు చేస్తారో అనే భయంతో ఇల్లుదాటి బైటకు రావడం లేదు. అటువంటి అవకాశవాదులు భారత ప్రభుత్వం భుజానవేసుకొని, ప్రవాస భారతీయుల సమ్మేళనాలు అంటూ రాజమర్యాదలు చేస్తుండటం సిగ్గుచేటుగా భావించాలి. ౦శ్రీబనీ ఖీవజీట - కోటి ఆశల కొత్త సంవత్సరం ఆపరేషన్ సిందూర సమయంలో రెండు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే ఆపివేసానని ట్రంప్ ఇప్పటికీ గొప్పలు చెప్పుకొంటున్నారు. ఈ విషయంలో ఆయన 'అహంకారం' దెబ్బతినకుండా భారత్ తెలివిగా వ్యవహరించి ఉంటే ఇన్ని సమస్యలు ఎదురయ్యేవి కావని దౌత్యా నిపుణులు భావిస్తున్నారు. రష్యాపై అమెరికా ఆంక్షలను బేతఖార్ చేస్తూ భారత్ కన్నా చైనా, ఐరోపా దేశాలు ఎక్కువగా దిగుమతులు చేసుకొంటున్నా మాట్లాడని ట్రంప్ కేవలం చమురు చౌకగా వస్తుందని కొంటున్న భారత్‌ను లక్ష్యంగా చేసుకొని, సుంకాలను 50 శాతంకు పెంచేందుకు ఈ 'అహంకారమే' కారణం అని దౌత్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ సమయంలో పాకిస్థాన్‌తో సంప్రదింపులు జరిపిన అమెరికా ఆ దేశాన్ని మందలించి, కాల్పుల విరమణకన్నా గత్యంతరం లేకుండా చేసిందని తెలివిగా చెప్పినా మరో విధంగా ఉండేదా? మన జాతీయ సార్వభౌమత్వాన్ని రాజీపడకుండా చాకచక్యంగా వ్యవహరించే ప్రయత్నం చేయలేదు. అందుకు స్వదేశంలో రాజకీయ ప్రయోజనాలే అడ్డు వచ్చాయా? కొత్త బహుళ ధ్రువ ప్రపంచంలో, భారతదేశం ఒక అసాధారణమైన పాత్ర వహించాల్సి ఉంది. స్నేహపూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ, పాకిస్తాన్ ప్రధాన సైనిక సరఫరాదారుగా, మన సరిహద్దు భూభాగంపై శత్రుహక్కుదారుగా చైనా ఒక ప్రధాన ముప్పుగా మిగిలిపోయింది. సుంకాల ఒప్పందంపై అమెరికాతో ప్రతిష్టంభన నెలకొన్నప్పటికీ గత నవంబర్‌లో అన్నికాలాలలోనూ అత్యధిక ఎగుమతులు నెలకొనడంతోపాటు, 2025లో ఆకట్టుకునే ఆర్థిక వృద్ధి నమోదు చేయడం ద్వారా ఈ ప్రతిబంధకాలు తట్టుకోగలననే సంకేతం భారత్ ఇవ్వగలిగింది. అమెరికా, కెనడా వంటి అనేక దేశాలలో భారతీయ విద్యార్థులు, ఉద్యోగం కోసం వెళ్ళినవారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. చివరకు రష్యా, ఉక్రెయిన్ సైన్యాలలో సైతం మోతపూరితంగా చేరి చావుకు తెచ్చుకుంటున్నారు. అయినా, భారత ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం తప్ప ఏమీ చేయలేకపోతున్నది. అన్ని పొరుగు దేశాలతో భారత్ సంబంధాలు ఆందోళనకరంగానే ఉన్నాయి. ఆయా దేశాలలో భారత్ వ్యతిరేకశక్తులు విజృంభిస్తూ ఉండటం, మరోవంక చైనా, పాకిస్థాన్ ప్రాబల్యం వారిపై పెరుగుతూ ఉండటం తీవ్రంగా పరిగణించాల్సిందే. దౌత్యవిధానాలను స్వదేశీ రాజకీయ ప్రయోజనాలతో ముడిపెడుతూ వస్తుండడంతో భారత్ అంతర్జాతీయంగా తీవ్రమైన ఒత్తిడులను ఎదుర్కొంటుందని గుర్తెరగాలి. స్వదేశీ రాజకీయ ప్రయోజనాలకు పరిమితం కాకుండా అంతర్జాతీయంగా భారత్ ప్రయోజనాలు, ప్రతిష్టలను దృష్టిలో ఉంచుకోవాలి. భారతదేశం బహుశా పాకిస్తాన్ నుండి ఈ సందర్భంగా ఒక పాఠం నేర్చుకోవచ్చు. మనం ఒక ప్రతిపాదన చేసామంటే దానిని అమలు చేస్తామని కాదని తెలుసుకోవాలి. తిరుగుబాటుతో నిండిన బలూచిస్తాన్‌లో చమురుకోసం లేదా శాంతియుతంగా ఖనిజాల కోసం తవ్వకాలు విజయవంతంగా చేపట్టడానికి అమెరికానుండి తీవ్రమైన ఒత్తిడులు ఎదురవుతున్నాయి. పాకిస్తాన్ ఆకర్షణీయమైన ఒప్పందాన్ని అందించడంలో చాతుర్యం, సాహసోపేతత్వాన్ని ప్రదర్శించింది. తద్వారా ఆ ప్రాంతంలో తిరుగుబాటుదారులు కట్టడి చేసేందుకు

# కథా సాహిత్యంలో కొత్త ఒరవడులు అల్లం రచనలు



సాధారణంగా కథల పాఠకులు కొత్తదనం కోరుకుంటారు. ఇది గ్రహించే కథా రచయితలు పాఠకులను తమ కథల పట్ల ఆసక్తిని పెంపొందించే కథా వస్తువులను ఎంచుకునే ప్రయత్నం చెయ్యడం కద్దు. దీనిని పూర్తిగా అర్థం చేసుకుని తెలుగు కథా రచనలో కొత్త ఒరవడిని సృష్టించా డు అల్లం శేషగిరి రావు. ఎన్నో కథలు వచ్చాయి కాని తెలుగులో వేట గురించి కథలు అల్లం శేషగిరిరావు రాసేవరకూ రానేలేదని చెప్పవచ్చు. అడవిలోని క్రూర మృగాల ప్రాకృతిక ధర్మాలను కథా వస్తువుగా తీసుకున్నా , మానవ మానసిక స్థితిని నిగూఢంగా సూచించడమే ఆయన రచనా లక్ష్యంగా ప్రస్ఫుటం అవుతుంది. మామూలుగా కాక, అయన కథలను విశ్లేషణా పరంగా ఆలోచనకు భూమిక చేశాడు. అల్లం శేషగిరిరావు (డిసెంబర్ 9, 1934 - జనవరి 3, 2000) ప్రముఖ తెలుగు కథా రచయిత. 1934, డిసెంబర్ 9 న ఒడిశా (నాటి ఒడిషా) లోని గంజాం జిల్లాలో జన్మించాడు. శేషగిరి రావు కథలు తమాషాకు రాసిన కథలు కావు. జీవితం గురించి రచయిత తీవ్ర ఆలోచన, లోతుగా పరిశీలన, జీవితంలో అన్యాయాల గురించి ఆందోళన, వేటకథల నేపథ్యంగా అర్థం చేసుకోవచ్చు. వేటాడడం, అడవి మృగాల స్వభావం, సహజ లక్షణం. ప్రాకృతిక ధర్మం కూడా. సంస్కార వంతుడైన మనిషి మృగంలా మారి బలహీనుణ్ని పీక్కుతినే అరాచ కత్వం, బడుగుల మూలుగులను పీల్చేసే బలాధికృతల గురించి నిక్కచ్చిగా, నిజాయతీగా మాట్లాడే కథలు తెలుగులో తక్కువ కనిపిస్తాయి. అలాంటి అరుదైన కథలను పాఠకులకు అందించి, ఆలోచింప చేసిన రచయిత అల్లం శేషగిరిరావు. ఆయన తెలుగు హెమింగ్వే గా లబ్ధ ప్రతిష్టులు. తరాలు మారినా, కాలంలో మార్పు వచ్చినా, అలనాటి నుండి సామాజిక పరిస్థితులలో ఆశించిన మార్పు రానేలేదు. బలవంతుడు, బలహీనునిపై, నిస్సహాయతలపై ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. నాగరిక ముసుగులో దాగిన ఈ అమానవీయతను ఉన్నది ఉన్న ట్టుగా చూపెడతాయి శేషగిరిరావు కథలు. ఇవి మనిషిలోని జంతు ప్రవృత్తిని తేటతెల్లం చేస్తాయి. ఎవరూ చూడని కొత్తకోణాన్ని దర్శించేందుకు వీలు కల్పిస్తాయి. కొత్త ఎత్తుగడ, ఉత్కంఠ, ఆసక్తికర ముగింపూ, అటవీ సంబంధ విశేషాలూ, జంతువుల సహజ ప్రవర్తనాస్థితి.. ఇలాంటి అంశాలతో ఈ కథలు పాఠకులను ఆగకుండా చదివింప జేస్తాయి.రైల్వేలో గుమాస్తాగా పని చేసిన అల్లం శేషగిరిరావు సమాజాన్ని నిశితంగా పరిశీలించిన తీరు అమోఘం, అద్వితీయం, అస మానం. మనుషుల ధోరణు ల్లోని మానవీయ, అమానవీయ కోణాలను, అంతః సంఘర్షణలను అయన అర్థం చేసుకని కథా వస్తువులుగా మలచు కున్నాడు. తాను చేసుకున్న అవగాహనకు తనదైన భాష, శిల్పాలను జోడించి పాఠకుల హృదయాలను అంది పుచ్చుకునే అద్భుత కథలు రాశాడు. 1980లో 'మంచి ముత్యాలు' పేరిట పుస్తక రూపంలో వచ్చాయి. మరిన్ని కథలను కలుపుకుని 'అరణ్య ఘోష'గా వెలువడ్డాయి. ఇటీవల కథా స్రవంతి (అరసం) వారు 'అల్లం శేషగిరిరావు కథలు' పేరిట ఎంపిక చేసిన వాటిని ప్రచురించారు. శేషగిరిరావు రాసినవి తక్కువే. వాటిలోనూ కొన్ని సుదీర్ఘంగా సాగుతాయి. అయితే.. విషయ ప్రాధాన్యం, వైవిధ్యం మూలంగా ఆ నిడివి పాఠకులను అంతగా బాధించదు. 'మృగ తృష్ణ, వఱడు, ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్, జాతి కుక్క, పులి చెరువులో పిట్టల వేట, అశ్వమేథం, నరమేథం, చీకటి' తదితరాలు శేషగిరిరావు కథల్లో చెప్పుకోదగినవి. మనిషికి ప్రతిబింబాలు 'వఱడు' కథ 'దర్పణ్ సీరిస్'లో భాగంగా దూరదర్శన్‌లో సింగిల్ ఎపిసోడ్‌గా ప్రసారమైంది. వఱడు లాంటి మనుషులు మన సమా జంలో ఉన్నారని హెచ్చరించిన ఈ కథ, నాటకం గానూ విశేష ఆదరణ పొందింది. వఱడంటే 'ముసలి నక్క' అని నిఘంటు అర్థం. ముసలి నక్కలు వాటంతటవి వేటాడి తినలేవు కదా. దాంతో పగలంతా ఇతర జంతువుల ఉనికిని కనిపెట్టి, రాత్రిపూట పులిని వాటిమీదకి ఉసిగొల్పి చంపిస్తాయి. పులి తినగా మిగిలిన మాంసంతో కడుపు నింపు కుంటాయి. ఈ కథలో మనిషిలో దాగుండే జంతు స్వాభావిక క్రౌర్యాన్ని చూపించాడు. అందుకే ఈ కథకు 'ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్'గా పేరు పెట్టాడు. 'మృగ తృష్ణ' కథలో కనిపించేది దుప్పి వేట కాదు. అది అక్షరాలా బలహీనుడి మీద బలవంతుడి వేట మాత్రమే. ఒకరిది విలాసం కొరకు వేట. మరొకరిది జీవిక కోసం పోరుబాట. పులులను దర్జాగా వేటాడి, వాటి చర్మాలను కోటగోడలకి వేలాడ దీసుకునే జమిందారీలను ఏ చట్టాలూ ఏమీ చేయలేవు. చర్యలు తీసుకోనూ లేవు. పిట్టలను కొట్టి బతికే బడుగు జీవులకే అన్ని శిక్షలూ అమలవు తుంటాయి. కన్నీటిగాథ 'చీకటి', ఆరిపోయిన చైతన్యాగ్ని కణాన్ని రాజేస్తుంది.మనిషికి ప్రతిబింబాలు తుపాకీ చప్పుళ్ల తోనూ, కొండగొర్రె అరు పుల తోనూ, పులి గాండ్రిం పుల తోనూ, దగాపడ్డ దీనుడి మూలు గులతో ప్రతిధ్వనించే శేషగిరిరావు ఏ కథ ను తరిచి చూసినా, వేదనా భరిత 'అరణ్య ఘోష' వినపడుతూ ఉంటుంది. ఉదాత్తంగా, గంభీరంగా సాగిపోయే ఈ కథలు ప్రాకృతిక సౌందర్యాన్ని కొత్తకోణంలో చూపిస్తాయి. వైవిధ్య పక్షి జాతుల ప్రస్తావన అక్కడక్కడ మనసును ఉల్లాస పరుస్తుంది. ఉల్లంకి పిట్టలూ, తీతువ పిట్టలూ, పరదలూ, గూడ కొంగలూ, పాముల వార (పెద్ద కొంగలు).. ఇలా పక్షులూ, వాటి గమనాలనూ గమ్మత్తుగా వివరిస్తారు రచయిత. వేటను వర్ణించేటప్పుడు మాత్రం భయానక వాతావరణాన్ని సృష్టిస్తాడు. వేటాడేది మనిషి అయినా, మృగమైనా అడవి రక్తంలో స్నానించినట్టు ఓ భీతావహ చిత్రం కళ్లముందు కదలాడేటట్టు కథని నడిపిస్తాడు. జానెడుపొట్ట కోసం దేవులాడుకొనే దీనుల పోరాటాలు కనిపిస్తాయి. జంతువుల వేట నేపథ్యంలో మనిషిలో దాగుండే క్రూరత్వాన్ని, నాగరిక సమాజంలో మానవ స్వభావాన్ని మృగాలవైపునుంచి చెప్పుకొస్తాయి అల్లం శేషగిరిరావు కథలు. సాహిత్యంలో వీటిని 'వేట కథలు' అన్నారు. కానీ, చారిత్రకంగా వేట అసలు అర్థాన్ని నిర్వచించ గలిగితే ఇవి సమాజంలోని ఆధిపత్య శక్తుల చేతుల్లో నానా హింసలకు గురైన బడుగుల జీవితాలను కళ్లకుకట్టే యాథార్థ గాథలని అర్థమవుతుంది. ఇదే మారణ హోమం ఇప్పటికీ కొనసాగుతుందని ఈ కథలు చదివితే పాఠకులు కచ్చితంగా అంగీకరిస్తారు. బతుకే బలిపీఠంగా మారుతున్న నేటి సమాజంలో ఆధిపత్యం మీద పోరాటం చేసే వారు ఎప్పుడూ ఓడిపోతూనే ఉంటారు. చీకటి కోణా లెన్నింటినో వెలుతురు బాట పట్టించిన అల్లం శేషగిరిరావు తర్వాత, మళ్లీ ఇలాంటి కథలు మళ్లీ రానే రాలేదు.

# సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే



ప్రేమ స్వరూపిణి, భారతీయ సంఘ సంస్కర్త, రచయిత్రి, తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సమాజ విప్లవకారిణి, తొలి మహిళా ఉపాధ్యాయురాలు, తొలి బాలికల పాఠశాల వ్యవస్థాపకురాలు, కుల వ్యవస్థ వ్యతిరేకి, మహిళా హక్కుల పరిరక్షకురాలు, పేదల పక్షపాతి, ధైర్య కవచం ధరించిన ధీశాలి, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సావిత్రిబాయి పూలే కులమతాలకు అతీతంగా సమానత్వ సాధనకు కృషి చేసిన మహోన్నత మహిళ. నిమ్నవర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన జ్యోతీరావ్ పూలే సహధర్మచారిణి అయిన సావిత్రి బాయి, తన భర్తతో కలిసి 01 జనవరి 1848 రోజు పూణెలో ప్రప్రథమంగా బాలికల పాఠశాలను ప్రారంభించిన ధీరవనిత. అస్పృశ్యులు, శూద్రులు, పితృస్వామ్యం, పురుషాధిక్య సమాజ పోకడలు, సకల జనుల హక్కుల ఉల్లంఘనలు, లింగ వివక్ష, కుల వ్యవస్థలకు వ్యతిరేకంగా గళమెత్తిన వీర సబల మహిళా శిరోమణి మన సావిత్రిబాయి పూలే. చీకటి యుగంలో సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమ న్యాయాల సాధనకు కృషి చేసిన ధైర్య మహిళామణి మన సావిత్రిబాయి. 03 జనవరి 1831 రోజు మహారాష్ట్ర కాస్తారా జిల్లా నయాగావ్ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన సావిత్రిబాయికి తెలంగాణలోని నిజామాబాదు, ఆదిలాబాదు జిల్లా ప్రాంతాల్లోకి మున్నూరుకాపు వర్గానికి చెందిన బంధువులు కూడా ఉండడం ఒక విశేషం. తన 9వ ఏటనే 13 ఏండ్ల జ్యాతిరావ్ పూలేను వివాహమాడిన సావిత్రిబాయి తన భర్తతో కలిసి నడిచి సంఘ సంస్కరణకు పూనుకున్నారు. ఉన్నత, అగ్ర వర్ణాలు వ్యతిరేకించినా వెరవకుండా, భౌతిక దాడులకను కూడా సహిస్తూ, బురద చల్లినా తుడుచుకుంటూ, అసభ్య పదజాల దూషణలను పెడచెవినపెట్టి తమ లక్ష్య సాధనకు జీవితాలను అంకితం చేసిన పుణ్య దంపతులు సావిత్రిబాయి జ్యోతిరావ్వ పూలేలు. నాటి బడుగు వర్గాల ప్రోత్సాహంతో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా సాధికారతకు ఆనాడే బీజాలు వేసారు. తమకు సంతానం లేకపోయినా ఒక బ్రాహ్మణ వితంతువు కూమారుడైన యశ్వంతరావును దత్తత తీసుకున్నారు. ఆనాటి సమాజ కట్టుబాట్లు, బ్రాహ్మణ ఆధిక్య సంప్రదాయాలు, అగ్రవర్ణాల పెత్తనాల మధ్య 12 మే 1848 రోజు బహుజనులకు పాఠశాలను ప్రారంభించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధైర్యశాలా మన సావిత్రిబాయి. తమ జీవితకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో 52 వరకు పాఠశాలలు నెలకొల్పి బడుగుల బతుకుల్లో సరస్వతీ మాత అక్షర వెలుగులు ప్రసరింపజేశారు. తాము నమ్మారు విలువలకు కట్టుబడిన దంపతులు గృహ బహిష్కారానికి కూడా గురి అయ్యారు. సావిత్రిబాయి పూలే జన్మదినం రోజును తెలంగాణ ప్రభుత్వం "తెలంగాణ మహిళా ఉపా ధ్యాయ దినోత్సవం"గా నిర్వహించుకోవాలని నిర్ణయించడం సముచితంగా ఉన్నది. స్త్రీల అభ్యున్నతి కోరి 1952లో "మహిళా సేవా మండల్" అనే సంఘాన్ని ఏర్పాటు చేసిన సావిత్రి బాయి మహిళల హక్కుల పరిరక్షణకు అవిశ్రాంత పోరాటం చేశారు. మహిళా హక్కులే మానవ హక్కుల్ని నినదించిన మేటి వనిత మన సావిత్రి. అసత్య అగ్రవర్ణ దురహంకారాలకు వ్యతిరేకంగా 1873లో ఆధ్యాత్మిక పునాదులతో "సత్యశోధక్ సమాజ్" అనబడే సంఘాన్ని ప్రారంభించి బాల్య వివాహాలు, మేధ నమ్మకాలు, వితంతువుల శిరోముండనం, సతీసహగమనాలకు వ్యతిరేకంగా పోరాడు తూనే, వితంతు పునర్వివాహాలకు పునాదులు వేసి తమ ఆత్మ సౌందర్యాన్ని రుజువు చేసుకున్నారు. వితంతువులకు ఆశ్రయం, పేద ఆడ పిల్లలకు అన్నం పెట్టడం, గర్భవతులకు పురుళ్లు పోయడం, పురోహితులు లేకుండా వివాహాలు చేయడం, కులాంతర వివాహాలు చేయడం, తల్లి వదిలేసి వెళ్లిన అనాథ శిశువును దత్తత తీసుకోవడం, అంటరానితనాన్ని రూపుమాపడం, కరువు సమయాల్లో వేల మంది బడుగు బలహీనవర్గాల ప్రజలను అక్కున చేర్చుకోవడం, తమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేయడం లాంటి అసాధ్య లక్ష్యాలను సుసాధ్యం చేసింది మన మహా మహిళ సావిత్రిబాయి పూలే. 1954లో రచయిత్రిగా "కావ్యపూలే", 1891లో "పావన కాశీ సుభోధ్ రత్నాకర్" అనబడే కవితా సంపుటులను ప్రచురించిన సావిత్రిబాయి పూలే ఉపన్యాసాలను 1892లో పుస్తకరూపంలోకి తేవడం జరిగింది. 28 వనంబర్ 1890 రోజు భర్త జ్యోతీరావ్ పూలే మరణంతో అంతులేని దుఃఖాన్ని దిగమింగుతుంటూ దేశంలోనే తొలిసారి తన భర్త చితికి తానే స్వయంగా నిప్పు పెట్టి మరో అభ్యుదయ అధ్యాయానికి తెర తీసారు. 1897లో వచ్చిన ప్లేటు వ్యాధి సమయంలో తన కుమారుడితో కలిసి వ్యాధిగ్రస్థులకు సేవలు చేశారు. కరువు, ప్లేటు వ్యాధి రెచ్చిపోయిన సమయంలో జోలె పట్టి విరాళాల సేకరణ, వైద్య శిబిరాల నిర్వహణ, వేల నిరుపేదలకు బుక్కెడా బువ్వ పెట్టడం, ప్లేగు వ్యాధి బాధిత పిల్లలకు సేవలు చేస్తూ, అదే వ్యాధి బారినపడిన సావిత్రిబాయి 10 మార్చి 1897 రోజు తుది శ్వాస విడిచారు. మన ఏకైక శత్రువు అజ్ఞానమని, అన్ని సమస్యలకు ఔషధం విద్య అంటూ ప్రచారం చేసిన సావిత్రిబాయి "నిత్య చైతన్య జ్ఞాన జ్యోతి". 'ఆధునిక విద్యకు తల్లి (మదర్ ఆఫ్ మాడ్రన్ ఎడ్యుకేషన్)" మహిళా విముక్తిదాత, గొప్ప మానవతావాది, విప్లవకారిణి అయిన సావిత్రిబాయి పూలే సుసంపన్న జీవితం నేటి యువతరానికి దారి దీపం కావాలని ఆశిద్దాం, ఆమె మహోన్నత ఆశయాలను పూర్తి చేయడానికి అవిరళ కృషి చేద్దాం.

# వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు

వర్క్ - లైఫ్ బ్యాలెన్స్ అనే అంశం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగ ఒత్తిడి, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్న ప్రశ్నపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తాజాగా వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలపైనే మాట్లాడే జైశంకర్ ఈసారి తన వ్యక్తిగత జీవన విధానం గురించి ఓపెన్‌గా చెప్పడం విశేషంగా మారింది. ఐఐటీ మద్రాస్ విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన జైశంకర్... తనకు మిగతా ఉద్యోగుల్లా వారాంతపు సెలవులు ఉండవని స్పష్టం చేశారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు షెడ్యూల్ వేసుకుని పనిచేయడం తన వృత్తిలో సాధ్యం కాదన్నారు. అంతర్జాతీయ వ్యవహారాలకు టైమ్ టేబుల్ ఉండదని, ప్రపంచంలోని



దేశాలు వేర్వేరు టైమ్ జోన్లలో ఉండటంతో ఎప్పుడైనా పని చేయాల్సి వస్తుందని వివరించారు. తన రోజువారీ జీవితంలో కొన్ని అలవాట్లను పాటిస్తూ మానసిక ప్రశాంతతను పొందుతున్నానన్నారు. విశ్రాంతి కోసం సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, సినిమాలు చూడడం, క్రీడల్లో జరుగుతున్న విషయాలను తెలుసుకోవడం వంటి అలవాట్లు తనకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ అలవాట్ల వల్ల ప్రపంచంతో అనుసంధానమై ఉండగలుగుతున్నానని, అదే తనకు వర్క్ - లైఫ్ బ్యాలెన్స్‌ను ఇస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా బ్రేక్ తీసుకోవడం లేదా డిటాక్స్ కావాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్న జైశంకర్... ఈ విధానంతో తన జీవితం సహజంగానే కొనసాగుతోందన్నారు. అయితే ఈ అభిప్రాయాలు ఇంట్లో అందరికీ నచ్చవని నవ్వుతూ చెప్పారు. తన భార్య కూడా ఇక్కడే ఉన్నారని, ఈ విషయంపై ఆమె తనతో విభేదించే అవకాశం ఉందని సరదాగా వ్యాఖ్యానించారు. జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు సోషల్ మీడియాలోనూ చర్చకు దారి తీశాయి.

# ఆర్థిక సంక్షోభం... ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇరాన్‌లో నిరసనకారులపై అక్కడి భద్రతా దళాలు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిపై కాల్పులు జరపవద్దని, అలాంటి వారిని అమెరికా కాపాడుతుందని అన్నారు. శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని ఆయన అన్నారు. అమెరికా అన్నింటికీ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సీనియర్ సలహాదారుడు అలీ



లారిజాని తిప్పికొట్టారు. ఈ వ్యవహారంలో అమెరికా జోక్యం అవసరం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. అమెరికా జోక్యం చేసుకుంటే ఆ ప్రాంతమంతా ఘర్షణలకు దారితీస్తుందని వ్యాఖ్యానించారు. తమ జాతీయ భద్రత రెడ్ లైన్ వంటిదని, దీనిని పరీక్షించాలనుకోవడం సాహసమే అవుతుందని అన్నారు. దేశంలో ధరలు పెరగడంతో పాటు కరెన్సీ విలువ పడిపోయింది. ఇరాన్ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. దీంతో దేశంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో నిరసనకారులు పోలీసుల కార్లకు నిప్పంటించారు. పలు ప్రాంతాల్లో భద్రతా దళాలు కాల్పులు జరపడంతో పలువురు ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు.

# మొబైల్ ఫోన్‌తో వ్యక్తిని స్కాన్ చేసిన పోలీస్.. బంగ్లాదేశీయుడో కాదో గుర్తిస్తుందని వెల్లడి

**లక్నో:** పోలీసులు ఒక ప్రాంతానికి వెళ్లారు. పౌరసత్వ ధృవీకరణ డ్రైవ్ సందర్భంగా ఒక వ్యక్తిని మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేశారు. అతడు బంగ్లాదేశీయుడో కాదో అన్నది ఆ పరికరం గుర్తిస్తుందని పోలీస్ అధికారి అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 23న కొందరు పోలీసులు, భద్రతా సిబ్బంది కలిసి నిర్బంధ వాహనంలో ఒక ప్రాంతానికి వెళ్లారు. అక్కడ పౌరసత్వ ధృవీకరణ డ్రైవ్ చేపట్టారు. ఆ ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలకు చెందిన వ్యక్తుల ఆధార వివరాలు, ఇతర ప్రతాలు పరిశీలించారు. కాగా, ఈ సందర్భంగా ఒక పోలీస్ అధికారి ఒక వ్యక్తిని మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేశారు. అతడి వీపు వెనుక మొబైల్ ఫోన్ ఉంచారు. ఆ వ్యక్తి బంగ్లాదేశీయుడో కాదో అన్నది మొబైల్ ఫోన్‌లోని పరికరం గుర్తిస్తుందని అన్నారు. వారి పత్రాలు పరిశీలించిన తర్వాత పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పోలీసులు నిర్వహించిన పౌరసత్వ ధృవీకరణ డ్రైవ్ విధానంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఒక వ్యక్తి జాతీయతను ధృవీకరించే పరికరం, సాంకేతికత నిజంగా ఉన్నదా? అన్న ప్రశ్నలు వ్యక్తమయ్యాయి. కాగా, ఆ పోలీసుల తీరు అవమానకరం,



అశాస్త్రీయం అని కొందరు మండిపడ్డారు. ఒక వ్యక్తి బంగ్లాదేశీయుడో కాదో అన్నది మొబైల్ ఫోన్ వంటి ఆ పరికరం గుర్తిస్తుందన్న పోలీస్ అధికారి వ్యాఖ్యలపై అధికారిక వివరణ ఇవ్వాలని మరికొందరు డిమాండ్ చేశారు.

# మేయర్‌గా మమ్దానీ ప్రమాణం..

# ఖాతాలో మరో రికార్డు

**న్యూయార్క్:** అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్ నగర 112వ మేయర్‌గా భారతీయ మూలాలున్న జోహ్రాన్ మమ్దానీ(34) ప్రమాణ స్వీకారం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం తెల్లవారుజామున న్యూయార్క్ ఓల్డ్ సిటీ హాల్ సబ్‌వే స్టేషన్ వద్ద నిరాడంబరంగా ఈ కార్యక్రమం జరిగింది. మమ్దానీ కుటుంబ సభ్యులు, సలహాదారులు, సన్నిహితులు హాజరయ్యారు. న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన తొలి దక్షిణాసియావాసిగా, తొలి ముస్లింగా, రెండో పిన్న వయస్కుడిగా మమ్దానీ రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే. ఆయనతో స్టేట్ అటార్నీ జనరల్ లెటీటియా జేమ్స్ ప్రమాణం చేయించారు. మమ్దానీ రెండు ఖురాన్ ప్రతులపై ప్రమాణం చేయడం గమనార్హం. భార్య రమా దువాజీ పక్కనే ఉన్నారు.

**అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తా..**

ప్రఖ్యాత బాలీవుడ్ దర్శకురాలు మీరా నాయర్, కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మహమూద్ మమ్దానీల కుమారుడైన జోహ్రాన్ ఉగాండా రాజధాని కంపాలాలో జన్మించారు. ఏడేళ్ల వయసులో కుటుంబంతో కలిసి అమెరికా చేరుకున్నారు. 2018లో అమెరికా పౌరసత్వం పొందారు. మేయర్‌గా న్యూయార్క్ నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని మమ్దానీ ప్రకటించారు. తన ప్రమాణ స్వీకారం నూతన అధ్యాయానికి ప్రారంభంగా అభివర్ణించారు. ప్రమాణ స్వీకారానికి వేదికగా పాత సబ్‌వే స్టేషన్‌ను ఎంచుకోవడానికి గల కారణాన్ని వివరించారు. ఇది 1904లో ప్రారంభమైందని, ఘన చరిత్ర కలిగి ఉందని పేర్కొన్నారు. ప్రజల



జీవితాలను మార్చేలా తెలివైన, సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడానికి ఇదొక ప్రతీక అని చెప్పారు. ప్రమాణం కోసం మమ్దానీ ఉపయోగించిన ఖురాన్ ప్రతులకు కూడా ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. ఇందులో ఒకటి మమ్దానీ తాత నుంచి వారసత్వంగా వచ్చింది. మరొకటి న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీ నుంచి తీసుకొచ్చారు. దీనికి 200 ఏళ్ల చరిత్ర ఉంది. నల్ల జాతీయుల సంస్కృతిపై స్కోమ్‌బర్గ్ సెంటర్ ఫర్ రీసెర్చ్ సంస్థ అధ్యయనం చేసింది. ఈ క్రమంలోనే పలు ఖురాన్ ప్రతులను, పుస్తకాలను సేకరించిం ది. వీటిని న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీలో భద్రపర్చారు. అందులో ఒకటి మమ్దానీ ఉపయోగించిన ఖురాన్ కావడం విశేషం. తమ లైబ్రరీ నుంచి తీసుకెళ్లిన ఖురాన్‌పై మేయర్ ప్రమాణం చేయడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నామని లైబ్రరీ సీఈఓ ఆంథోనీ డబ్ల్యూ మార్క్స్ చెప్పారు. ఖురాన్‌పై ప్రమాణం చేసిన తొలి న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మరో రికార్డు సృష్టించారు.

## నీరు కాదు విషాన్ని పంచారు..



కలుషిత నీరు తాగి మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు అక్కడి ప్రభుత్వం నీరు కాకుండా.. విషాన్ని పంపిణీ చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోందని రాహుల్ విమర్శించారు. కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొందని.. పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు అధికార భాజపా నేతలు నిర్లక్ష్యపు ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలకు ఓదార్పు ఇవ్వకుండా.. అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 'మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటి గురించి గతంలో ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? తాగే నీటిలో మురుగునీరు ఎలా కలిసింది? వెంటనే నీటి సరఫరా ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?' అని రాహుల్ ప్రశ్నించారు. పరిశుభ్రమైన నీరు పొందడం ప్రజల హక్కు అని అన్నారు. ఈ హక్కును కాలరాసిన భాజపా ప్రభుత్వమే దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు.

**మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీనే కారణం: ఇండౌర్ ఘటనలో కీలక విషయం**

దుష్పరిపాలనకు మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని విమర్శించారు. మొన్నటి వరకు దగ్గు మందు కారణంగా, ఆ తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు కలుషిత నీరు కారణంగా మృతి చెందుతున్నారన్నారు. ఇలా ఎప్పుడు పేదలు మరణించినా.. మోదీజీ మాత్రం మౌనంగానే ఉంటారని విమర్శించారు. ఇక, ఓ మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీ వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని నగర మున్సిపల్ కార్పొరే షన్ అధికారులు తాజాగా తెలిపారు. ఈ కలుషిత నీరు తాగి ఇప్పటివరకు 10 మంది మృతి చెందారని ఇండౌర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ వెల్లడించారు.

## 'ఇక సమయం వచ్చింది'



పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ బలూచ్ మానవ హక్కుల నేత మీర్ యార్ బలూచ్, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు ఒక బహిరంగ లేఖ రాశారు. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ తుది దశకు చేరుకోవడంతో, రాబోయే కొద్ది నెలల్లో బలూచిస్థాన్‌లో చైనా తన సైన్యాన్ని మోహరించే ప్రమాదం ఉందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనా-పాకిస్థాన్ కూటమి భారత్, బలూచిస్థాన్ రెండింటికీ పెను ప్రమాదమని పేర్కొంటూ, ఈ సమస్యను సమూలంగా పెకిలించి వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎ' ద్వారా మీర్ యార్ ఈ లేఖను విడుదల చేశారు. "బలూచిస్థాన్ గడ్డపై చైనా సైనికులు అడుగుపెడితే, అది భారత్, బలూచిస్థాన్ భవిష్యత్తుకు ఊహించని ముప్పును కలిగిస్తుంది" అని ఆయన హెచ్చరించారు. గత 79 ఏళ్లుగా పాకిస్థాన్ ఆక్రమణ, ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం, దారుణమైన మానవ హక్కుల ఉల్లంఘనలతో బలూచ్ ప్రజలు నలిగిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ దేశానికి శాశ్వత శాంతి, సార్వభౌమత్వం లభించేందుకు ఈ సమస్యను మూలాలతో పెకిలించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గతేడాది (2025) పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మోదీ ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' ద్వారా తీసుకున్న సాహసోపేతమైన చర్యలను ఆయన ప్రశంసించారు. ఇది ప్రాంతీయ భద్రత పట్ల భారత నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. బలూచిస్థాన్‌లోని హింగ్లాజ్ మాత ఆలయం వంటి చారిత్రక ప్రదేశాలను ప్రస్తావిస్తూ, భారత్-బలూచిస్థాన్ మధ్య ఉన్న పురాతన బంధాన్ని గుర్తుచేశారు. ఆరు కోట్ల బలూచ్ ప్రజల తరఫున శాంతి, వాణిజ్యం, రక్షణ, భద్రత వంటి రంగాల్లో భారత్‌తో భాగస్వామ్యం కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే, మీర్ యార్ బలూచ్ రాసిన ఈ లేఖపై ఇప్పటివరకు భారత్, పాకిస్థాన్, లేదా చైనా ప్రభుత్వాల నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. పాక్ ఆక్రమిత కశ్మీర్ గుండా వెళ్తున్నందున, సీపీఈసీ ప్రాజెక్టును భారత్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.

## ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీల కోసం ప్రత్యేక కమిటీ



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య దశాబ్దకాలంగా కొనసాగుతున్న కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఓ ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) ఛైర్మన్లు, జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. గతేడాది జులైలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని చర్చించారు. ఇటీవల డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం తమ ప్రతినిధులను నామినేట్ చేయడంతో కమిటీ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. ఇరు రాష్ట్రాల మధ్య నీటిని సమానంగా పంచడం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలు వంటి కీలక అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను సూచిస్తుంది. ఇదే సమయంలో, కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2) గడువును కూడా కేంద్రం 2026 జులై వరకు పొడిగించింది.

ధర్మఘంట

# కవితకు ఓటు... ఎవరికి చేటు...

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో 2026 సంవత్సరం సరికొత్త సమీకరణాలకు వేదిక కాబోతోంది. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ లేదా బీజేపీ కంటే కూడా సొంత ఇంటి నుంచే వచ్చే ముప్పు అతి పెద్ద సవాల్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెట్టడం ఖాయమయింది. తెలంగాణ ఉద్యమ కాలం నుండి తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతిక సారథిగా కవితకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బీఆర్ఎస్ పార్టీలో మహిళా గళంగా ఆమె కీలకంగా వ్యవహరించారు. కారణాలు ఏమైనా ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆమె జాగృతి పేరుతో రాజకీయం చేస్తున్నారు. కానీ ఇంకా రాజకీయ పార్టీగా ప్రకటించలేదు. కొత్త ఏడాదిలో ఆమె సొంతంగా పార్టీని ప్రకటించి, మరింతగా క్షేత్రస్థాయిలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. అది బీఆర్ఎస్‌కు పరోక్షంగా పెనుగండంగా మారుతుంది. ఇది కేవలం రాజకీయ చీలిక మాత్రమే కాదు, కేసీఆర్ స్థాపించిన పార్టీకి నైతిక , సెంటిమెంట్ పరమైన దెబ్బగా పరిణమించే ప్రమాదం ఉందిరాజకీయాల్లో 1 లేదా 2 శాతం ఓట్ల వ్యత్యాసమే అధికార మార్పిడికి కారణమవుతుంది. గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే



బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్య ఓట్ల శాతం తేడా చాలా స్వల్పంగా ఉంది. కవిత కొత్త పార్టీ పెట్టి, రాష్ట్రవ్యాప్తంగా కనీసం ×4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగితే, అది నేరుగా బీఆర్ఎస్ గెలిచే స్థానాలపై ప్రభావం చూపుతుంది. బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకులో మహిళలు, సాంస్కృతిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తారు. కవితా తన బలాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తే, ఆ ఓట్లు చీలిపోయి అల్టిమేట్‌గా కాంగ్రెస్ లేదా బీజేపీకి లబ్ధి చేకూరుతుంది. కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేస్తే, బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఆమె వైపు చూసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఆమెకు ఉన్న పట్టు పార్టీకి నష్టం కలిగించవచ్చు. క్యాడర్ ఎవరి వైపు ఉండాలో తెలియక అయోమయానికి గురైతే, పార్టీ క్షేత్రస్థాయిలో బలహీనపడుతుంది. కేసీఆర్ ఇమేజ్‌ను నమ్ముకున్న కార్యకర్తలు, కుటుంబంలోనే చీలిక వస్తే మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది.కవితను తమ దారిలోకి తెచ్చుకోకపోతే లేదా ఆమెను పార్టీలో సముచిత స్థానంతో సంతృప్తి పరచకపోతే బీఆర్ఎస్ మనుగడకు పెద్ద సమస్యగా మారుతుంది. పార్టీకి విఘాతం కలగకుండా ఉండాలంటే కుటుంబ సమన్వయం కంటే కూడా రాజకీయ సమన్వయం అత్యవసరం. ఆమెను దూరం పెట్టడం వల్ల వచ్చే నష్టం కంటే, ఆమెతో కలిసి ప్రయాణించడం వల్ల కలిగే లాభాలను పార్టీ అధిష్టానం బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. 2026లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వాడుకుని పుంజుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు, ఈ అంతర్గత సంక్షోభం అడ్డంకిగా మారవచ్చు. కవితా ఫ్యాక్టర్ కేవలం ఓట్ల చీలికకే పరిమితం కాకుండా, పార్టీ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. కొత్త ఏడాదిలో కేసీఆర్ ఈ చిక్కుముడిని ఎలా విప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

# 24 గంటల మంచినీటి కోసం పక్కా ప్లాన్

**హైదరాబాద్ :** భాగ్యనగరం శరవేగంగా విస్తరిస్తోంది. అంబరాన్నంటే భవనాలు, ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలు, కోటిన్నరకుపైగా జనాభాతో ఈ మహానగరం ఇప్పుడు గ్లోబల్ హబ్‌గా మారింది. అయితే పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతులు, ముఖ్యంగా తాగునీరు, మురుగు నీటిపారుదల వ్యవస్థను సిద్ధం చేయడం ఒక సవాలుతో కూడుకున్న పని. ఈ సవాలును స్వీకరించిన హైదరాబాద్‌మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ స్వరేజ్ బోర్డు, సిటీని ఒక ఆదర్శవంతమైన వాటర్ సెక్యూర్ సిటీగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. వాటర్ బోర్డు, వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులతో నగర భవిష్యత్తును మార్చడానికి రంగం సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం రోజు విడిచి రోజు లేదా కొన్ని శివారు ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతోంది. కానీ, ఈ పరిస్థితిని మార్చడమే లక్ష్యంగా వాటర్ బోర్డు ప్రణాళికలు రచిస్తోంది. 2027 చివరి నాటికి నగరంలోని ప్రతి ఇంటికీ ప్రతి రోజూ తాగునీరు అందించడం బోర్డు ప్రాథమిక లక్ష్యం. ఆ తర్వాత 2047 నాటికి తెలంగాణ కోర్ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేలా మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. నగర తాగునీటి అవసరాలు భవిష్యత్‌లో భారీగా పెరగనున్నాయి. 2027 నాటికి నగర తాగునీటి డిమాండ్ 835 ఎంజీడీలుగా, 2047 నాటికి అది ఏకంగా 1114 ఎంజీడీలుగా పెరుగుతుందని అంచనా. ఈ డిమాండ్‌ను తట్టుకోవడానికి గోదావరి జలాలే కీలకం. ఇప్పటికే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా జలాలను వందల కిలోమీటర్లు దూరం నుంచి తెస్తున్న బోర్డు, ఇప్పుడు గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. రూ. 7,360 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా అదనంగా 20 టీఎంసీల నీటిని తరలించడానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.నగరం మధ్యలో ప్రవహించే మూసీ నదని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఎప్పటి నుంచి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి వాటర్ బోర్డు ఒక భారీ ప్రాజెక్టును చేపట్టింది. మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటి శుద్ధి కేంద్రాల



నిర్మాణం ద్వారా నదికి పాత వైభవాన్ని తీసుకురావడానికి అధికారులు శ్రమిస్తున్నారు.

వంద శాతం మురుగు శుద్ధి: పర్యావరణ పరిరక్షణలో మైలురాయి

మురుగు నీరు నేరుగా చెరువులు, నదుల్లో కలవకుండా అడ్డుకోవడం నగర ఆరోగ్యానికి ముఖ్యం. దీని కోసం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 972 ఎంఎల్డీ సామర్థ్యం గల 39 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ప్రారంభమైంది. అమృత్-2.0 పథకంలో భాగంగా రూ. 3849.10 కోట్ల వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయ.

2026 నాటికి ఈ పనులు పూర్తి అయితే హైదరాబాద్ మొత్తం మురుగు నీటి శుద్ధి సామర్థ్యం 2,850 ఎంఎల్డీలకు చేరుకుంటుంది. ఇది 2036 వరకు నగర అవసరాలను తీర్చగలదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా,మూసీ నదిలోకి మురుగు చేరకుండా ట్రంక్ లైన్లు వేసేందుకు 4700 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా సిద్ధమైంది.

వేసవి సన్నాహాలు

గత వేసవిలో భూగర్భ జలాలు 14 నుంచి 28 మీటర్ల వరకు పడిపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండటానికి వాటర్ బోర్డు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఇంకుడు గుంతల యజ్ఞం ద్వార వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. నగరంలో నమోదైన భారీ వర్షాలు, బోర్డు చర్యల వల్ల భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే 3 నుంచి 9 మీటర్ల వరకు పైకి వచ్చాయి. దీనిని మరింత ముందుకు తీసుకెళ్తూనే, 16వేల గృహాలకు నోటీసులు జారీ చేసి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. వచ్చే మార్చి నాటికి మరో 25వేల గృహాల్లో వీటిని పూర్తి చేయాలని బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది.

నగరంలోని ప్రతి మూలకు నీరు చేర్చడానికి కొత్త ప్రాజెక్టును బోర్డు వేగవంతం చేసింది.

1. కోకాపేట్ నియోపోలిస్ లే అవుట్: 298 కోట్లతో వాటర్ సప్లై ప్రాజెక్టు
2. మహీంద్రహిల్స్: 5మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
3. ఆస్మానగ్: 7.5 మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
4. మంజీరా నెట్‌వర్క్: 722 కోట్లతో నెట్‌వర్క్ ఆధునీకరణ
5. ఉస్మాన్ సాగర్ కండూట్: దీనిని పునరుద్ధరించి రోజుకు 21 మిలియన్ గ్యాలన్ల నీటిని తరలించడానికి 282 కోట్లతో అదనపు పైపు లైన్ నిర్మాణం చేపడుతున్నారు.

అంతే కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు వెంట 140 కిలోమీటర్ల మేర రేడియల్ రింగ్ మెయిన్, 98 కిలోమీటర్ల లింకు పైపులైన్ల కోసం 8వేల కోట్లో భారీ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ వాటర్ బోర్డు చేపట్టిన ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అయితే నీటి కరవు అనేది ఉండని ప్రభుత్వం భావిస్తోంది.

# పీపీటీ ఇచ్చే అవకాశం కల్పించాలి



**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రాజకీయాలు ముదురుతున్నాయి. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలను ఎండగట్టేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో పీపీటీని ఒక అస్త్రంగా ఎంచుకుంది. ఇందుకు ప్రతిగా తాము చేసిన అభివృద్ధిని వివరించేందుకు తమకూ పీపీటీ ఇచ్చే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పట్టుబడుతోందిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంలో జరిగిన విధ్వంసం పై ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ప్రాజెక్టుల రీ-డిజైనింగ్, అదనపు ఖర్చు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వంటి అంశాలపై పక్కా ఆధారాలతో కూడిన పీపీటీని సభలో ప్రదర్శించేందుకు సిద్ధమైంది. సభ మధ్యలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసి, ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టడమే కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ పీపీటీకి దీటుగా సమాధానం చెప్పేందుకు బీఆర్ఎస్ కూడా సిద్ధమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఏకపక్షంగా తన వాదనను వినిపిస్తే సరిపోదని, ప్రధాన ప్రతిపక్షంగా తమ వెర్షన్ ప్రజలకు తెలియజేయడానికి తమకూ పీపీటీ చాన్స్ ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఒకవేళ తమకు అవకాశం ఇవ్వకపోతే, గతంలో ఇలాగే అవకాశం నిరాకరించినప్పుడు ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభను బహిష్కరించిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పీపీటీ అంశం చర్చకు వచ్చింది. శీతాకాల సమావేశాల కాలాన్ని పెంచాలని, తమకు పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ కోరగా.. స్పీకర్ ఆ వినతిని పరిశీలిస్తామని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పాత సంప్రదాయాలను తెరపైకి తెస్తోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పీపీటీలు ఇచ్చినప్పుడు ప్రతిపక్షాలకు ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు తాము కూడా అదే సంప్రదాయాన్ని పాటిస్తామని కాంగ్రెస్ మంత్రులు స్పష్టం చేస్తున్నట్లుగా తెలుస్తోంది.2016లో అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రాజెక్టులపై పీపీటీ ఇచ్చినప్పుడు, కాంగ్రెస్ కూడా తమకు అవకాశం ఇవ్వాలని అడిగింది. కానీ అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరాకరించింది. ఇప్పుడు సీన్ రివర్స్ కావడంతో, అప్పుడు మీరు మాకు ఇవ్వలేదు.. ఇప్పుడు మేము మీకు ఇవ్వం అనే కాంగ్రెస్ వాదిస్తోంది. ఆ సంప్రదాయాన్ని పాటిస్తామని అంటున్నారు. తమకు అసెంబ్లీలో పీపీటీ చాన్స్ ఇవ్వకపోతే.. కాంగ్రెస్‌కు కౌంటర్ గా తెలంగాణ భవన్‌లో పీపీటీ ఇచ్చేందుకు హరీష్ రావు ప్రయత్నాలు చేస్తున్నారు.

## మూసీకి మహర్దశ..

-మొదటిపేజీ తరువాయి

ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు. మూసీ నది కాలుష్యం వల్ల పరివాహక ప్రాంతాల్లో పర్యావరణం, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థాలు, చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ ప్రాజెక్టును చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఒకప్పుడు నిజాం హయాంలో మూసీ తీరంలో గొప్ప అభివృద్ధి జరిగిందని, 1908 వరదల తర్వాత ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు మూసీకి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, మూసీ తీరంలో గురుద్వారా, మసీదు, చర్చి వంటివి నిర్మించి మతసామరస్యాన్ని చాటుతామని చెప్పారు. ప్రస్తుతం కన్సల్టెన్సీల ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నామని, అది పూర్తయిన వెంటనే శాసనసభలో సభ్యుల ముందు ఉంచి, వారి సలహాలు తీసుకుని ముందుకు వెళ్తామని సీఎం హామీ ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన నివాసాలు కల్పిస్తామని, హైదరాబాద్‌ను పర్యావరణ హిత నగరంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

### మూసీ ప్రాంతంలో ప్రతిపక్ష నేతలు ఉంటారా?: రేవంత్ రెడ్డి

మూసీకి శాశ్వత పరిష్కారం దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రెండేళ్లలో గండిపేటకు గోదావరి నీళ్లను తీసుకొస్తామన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందని వ్యాఖ్యలు చేశారు. ప్రణాళికబద్దంగా మూసీ ప్రక్షాళన జరుగుతుంది అంటూ క్లారిటీ ఇచ్చారు. ప్రతిపక్ష నేతలు మూసీ పరివాహక ప్రాంతంలో ఉండగలరా?' అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ..'మూసీ ప్రక్షాళనపై సభ్యులు సూచనలు చేశారు. సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం. మోక్షగుండం విశ్వేశ్వరయ్య వరద ముంపు పరిష్కారం చూపారు. నదీ పరివాహక ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోంది. చాలా దేశాల్లో నదీ పరివాహక ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి కొనసాగుతోంది. మూసీ నది అనంతగిరిలో మొదలై 240 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ఈసా, మూసా నదులు బాపూఘాట్ దగ్గర కలుస్తాయి. అందుకే అక్కడ గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ చేపట్టాం. మూసీ ప్రక్షాళనపై నెలల తరబడి అధికారులతో సమీక్షలు చేశాం. ప్రణాళికబద్దంగా మూసీ ప్రక్షాళన జరుగుతుంది. ఈసా, మూసా నదులను గోదావరి నీళ్లతో నింపుతాం. రెండేళ్లలో గండిపేటకు గోదావరి నీళ్లను తీసుకొస్తాం. సంక్రాంతిలోగా ఫస్ట్ ఫేజ్‌పై క్లారిటీ వస్తుంది. ఫస్ట్‌ఫేజ్‌లో గండిపేట నుంచి గౌరెల్లి వరకు ప్రక్షాళన జరుగుతుంది. మొత్తం 55 కిలోమీటర్ల మేర మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి జరుగుతుంది. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తాం. మూసీని కలుషితం చేయడంతో నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. మనుషులు నివాసం ఉండటానికి సాధ్యం కాని విధంగా నల్లగొండ జిల్లా మారిపోయింది. ఫ్లోరైడ్ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నల్లగొండ ప్రాంతంలో ఫ్లోరైడ్ కారణంగా బిడ్డలు అంగవైకల్యంతో పుడుతున్నారు. మూసీ నదిలో నీళ్లు పారాల్సిందేనని అధికారులకు ఆదేశిలిచ్చాం. శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని నిర్ణయించాం. గండిపేటలో ఆగర్భశ్రీమంతులు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. ఫామ్‌హౌసులు కట్టుకుని డ్రైనేజీ నీళ్లను గండిపేట చెరువులో కలిపారు. గండిపేట, మొయినాబాద్‌లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న వాళ్లు లక్షలు, కోట్లు ఖర్చు చేసి నాపై సోషల్ మీడియాలో బద్నాం చేయించారు. అయినా మేం భయపడలేదు. గుజరాత్‌లో సబర్మతి ప్రాజెక్ట్ చేపట్టి 60వేల కుటుంబాలను తరలించారు. యూపీలో కూడా గంగా నది ప్రక్షాళన కోసం ఇళ్లు కూల్చారు. ఢిల్లీలో యమునా నది ప్రక్షాళన చేస్తామని చెప్పారు. నిజాం చేసిన అభివృద్ధిని కాలగర్భంలో కలిపేశారు. మూసీ ప్రక్షాళనకు ఎంత అవుతుందో ఇప్పుడే చెప్పలేం. మూసీ పరివాహక ప్రాంతాల్లో శివాలయం, గురుద్వార్, మసీదు, చర్చి నిర్మిస్తాం. మూసీ ప్రక్షాళన జరగలా వద్దా?.. ప్రతిపక్ష నేతలు చెప్పాలి. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న పేదలకు నివాసాలు కల్పిస్తామంటే అడ్డుకుంటున్నారు. ప్రతిపక్ష నేతలు మూసీ పరివాహక ప్రాంతంలో ఉండగలరా?' అని ప్రశ్నించారు.

## కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న నేతలను దూరం చేసేలా కవిత మాట్లాడుతున్నారు

-మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు కవిత వెంటనే స్పందించారని, కానీ హరీశ్ రావుపై చేసిన విమర్శలపై ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని కోమటిరెడ్డి నిలదీశారు. ఇది చూస్తుంటే కవిత కేసీఆర్ వదిలిన రాజకీయ బాణంగా ఉన్నారని ఆరోపించారు. నల్గొండ జిల్లాకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని కవిత ప్రశ్నించి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసిందని కవిత స్వయంగా అంగీకరించడం హర్షణీయమని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ నేతలు దోచుకున్నారని కవిత స్వయంగా ఆరోపిస్తున్నారని ఆయన గుర్తు చేశారు.

## మేం మాట్లాడితే బెల్లు కొడుతున్నారు

-మొదటిపేజీ తరువాయి

మీకు మీకు స్నేహం ఉందనే విషయం తనకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. అయితే అలా మాట్లాడటం సముచితం కాదని స్పీకర్ పేర్కొన్నారు.

### తెలంగాణలో కుక్కకాట్లు పెరుగుతున్నాయి: అక్బరుద్దీన్ ఒవైసీ

తెలంగాణ రాష్ట్రంలో కుక్కకాట్లు పెరుగుతున్నాయని మజ్లిస్ పార్టీ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎవరినీ కించపరచడం లేదని, కానీ కుక్క కాట్లు పెరగడం ఆందోళనకరమని అన్నారు. జంతు సంరక్షణ సంస్థలు వచ్చి కుక్కలను పట్టుకోవద్దని, చంపవద్దని చెబుతుంటారని, కానీ అవే కుక్కలు చిన్న పిల్లలను కూడా కరుస్తున్నాయని ఈ విషయాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## చైనా మాంజాతో ముంచుకొస్తున్న ప్రమాదం

-మొదటిపేజీ తరువాయి

కొన్నిసార్లు అవి చెట్లకు చిక్కుకొని తెగిపోతున్నాయి. ఆ మాంజా అలాగే వేలాడుతుంటుంది. ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారుల మెడకు అది చుట్టుకొని గాయపడుతున్నారు. బైక్ వేగాన్ని బట్టి ప్రమాద తీవ్రత పెరిగి కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోతున్నారు. పక్షులు కూడా వాటికి చిక్కుకొని చనిపోయిన ఘటనలున్నాయి.

### మొక్కుబడి చర్యలతో అధికారులు

ఇటీవల షంషీర్‌గంజ్‌లో యువకుడు బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా గొంతుకు చుట్టుకొని తీవ్రంగా గాయపడ్డాడు. మల్లికార్జున్‌నగర్‌లో మరో యువకుడి మెడకు చుట్టుకోవడంతో గాయపడి ఆసుపత్రిలో చేరాడు. మెడ కింది వరకు 19 కుట్లు వేశారు. ఏటా ఈ తరహా ప్రమాదాలు జరుగుతున్నా, అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఎక్కడపడితే అక్కడ వాటి అమ్మకాలు జరుగుతున్నప్పటికీ మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు.

### తీసుకోవల్సిన జాగ్రత్తలు :

బైక్‌పై వీధులు, సందుల్లో వెళ్లేటప్పుడు పరిసరాలను గమనిస్తూ తక్కువ వేగంతో ప్రయాణించాలి. గాలి పటం తెగితే ఎగరేసిన వ్యక్తే మాంజా తొలగించాలి. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు ఫుల్‌హెల్మెట్ ధరించాలి. మాంజా, రోడ్డు ప్రమాదం జరిగినా కాపాడుతుంది. నిరంతరం తిరిగేవారు బైక్ హ్యాండిల్‌పై కైట్ గార్డ్‌లు అమర్చుకోవాలి. గాలిపటాలను ఎగరవేసేందుకు కాటన్, పర్యావరణ హిత దారాలు వాడటం మేలు. చైనా మాంజా వినియోగించొద్దు. రోడ్లు, విద్యుత్తు తీగలు, చెట్లు, పైవంతెనల సమీపంలో పతంగులు ఎగురవేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రోడ్లపై మాంజా ఉంటే జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించాలి.

ల చైనా మాంజా తయారీ ప్రమాదకరంగా ఉంటుందని నిపుణులు తెలిపారు. దీనిని నైలాన్, సింథటిక్ ఫైబర్ దారాలతో తయారుచేస్తారు. ఇందులో గాజుపొడి, అల్యూమినియం ఆక్సైడ్, లోహచూర్ణం, రంగులు, కృత్రిమ జిగురు మిశ్రమాన్ని పూసి ఎండలో ఆరబెడతారు. ఇలా చేయడం వల్ల తెగిపోకుండా పదునుగా ఉంటుంది. దారాన్ని గట్టిగా లాగితే చేయి తెగిపోయే పరిస్థితి.



## పిల్లలు అతిగా ఫోన్ చూస్తున్నారా?


పిల్లల్లో అధిక మొబైల్ వాడకం వ్యసనంగా మారి, వారి శారీరక, మానసిక ఆరోగ్యం, చదువులు, దినచర్యలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 'టెక్స్ట్ నెక్', కళ్ల అలసట, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత కాలంలో చాలా మంది ఫోన్ చేతికి ఆరో వేలిగా మారిపోయింది. పెద్దలతో పాటు చిన్న పిల్లలు కూడా ఫోన్‌ను విపరీతంగా వాడుతున్నారు. ఈ అతి వాడకం పెద్దల కంటే పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శారీరకంగా మానసికంగా వారిని ఇబ్బందికి గురి చేస్తుంది. మీ పిల్లలు కూడా అతిగా ఫోన్ చూస్తుంటే వారిని వెంటనే ఆ అలవాటు నుంచి దూరం చేయడం ఎలాగో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. పిల్లలో ఫోన్ చూసే అలవాటు క్రమంగా ఒక వ్యసనంగా మారుతుంది. పిల్లల దినచర్య, చదువు, ఆటలు, సామాజిక కార్యకలాపాలపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మొబైల్ ఫోన్‌లను అధికంగా ఉపయోగించడం వల్ల పిల్లల శ్రద్ధ, నిద్ర, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. అటువంటి పరిస్థితిలో ఈ అలవాటును ఎలా నియంత్రించాలో, పిల్లలను సమతుల్య, ఆరోగ్యకరమైన దినచర్య వైపు ఎలా ప్రేరేపించాలో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొబైల్ స్క్రీన్‌పై నిరంతరం వేలాడుతూ ఉండటం వల్ల 'టెక్స్ట్ నెక్' వంటి సమస్యలు వస్తాయి, ఇది మెడ, భుజాలు, వెన్నెముకపై చాలా ఒత్తిడిని కలిగిస్తుంది. మొబైల్ ఫోన్‌ల నుండి వెలువడే నీలి కాంతి కళ్ళను అలసటకు గురి చేస్తుంది, వాటిని పొడిగా చేస్తుంది, దృష్టిని బలహీనపరుస్తుంది. రాత్రి ఆలస్యంగా మొబైల్ ఫోన్‌లను వాడటం వల్ల నిద్రలేమి, అలసట మరియు చిరాకు పెరిగే నిద్ర హార్మోన్ 'మెలటోనిన్' ఉత్పత్తి తగ్గుతుంది. గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తగ్గుతుంది, ఇది ఊబకాయం మధుమేహం వంటి జీవనశైలి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. మొబైల్ వ్యసనాన్ని అధిగమించాలంటే తల్లిదండ్రులు ముందుగా తమ పిల్లలతో మాట్లాడటం ఉత్తమ మార్గం అని నిపుణులు అంటున్నారు. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల వారి ఆరోగ్యం, చదువులు, మానసిక అభివృద్ధిపై చెడు ప్రభావం చూపుతుందని పిల్లలకు వివరించడం అవసరం. సమయ పరిమితులను నిర్ణయించడం, మొబైల్ ఫోన్‌ల కోసం ప్రత్యేక సమయాన్ని నిర్ణయించడం, పిల్లలను ఇతర ఆసక్తికరమైన కార్యకలాపాల వైపు ఆకర్షించడం ఉపయోగకరంగా ఉంటుంది. ఆటలు, విహారయాత్రలు, చదువులు, కుటుంబంతో కలిసి చేసే అభిరుచులు మొబైల్ ఫోన్‌ల నుండి దృష్టి మరల్చడానికి సహాయపడతాయి. పిల్లలు మంచి ఉదాహరణను చూడగలిగేలా తల్లిదండ్రులు కూడా మొబైల్ ఫోన్‌ల వాడకాన్ని పరిమితం చేయాలి. క్రమంగా పిల్లలను కొద్దిసేపు మొబైల్ ఫోన్‌లను ఉపయోగించడం అలవాటు చేసుకోండి.

## వీరికి ద్రాక్ష విషంతో సమానం..



ఉతీజీజూవబ రాతిటవ ఇటటవఞబిబ: ఏదైనా పండు లేదా ఆహారం, రోజూ మితంగా తింటే మంచిది.. అలాంటి దినచర్య అనేక ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తుంది.. అయితే.. అవకాశం దొరికినప్పుడల్లా దానిని ఎక్కువగా తింటే, మీరు దానిని అనుభవించాల్సిందే అంటున్నారు ఆరోగ్య నిపుణులు.. ఈ వ్యాధులు, సమస్యలు ఉన్నవారు ద్రాక్షకు దూరంగా ఉండాలని.. లేకపోతే సమస్యలు తప్పవని సూచిస్తున్నారు. ద్రాక్ష అనేది అందరూ ఇష్టపడే పండు.. తీపి, పులుపు కలగలిపి జ్యూసీగా ఈ చిన్న పండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. బ్లాక్, గ్రీన్ ద్రాక్షాలు ఏవైనా.. తినడం ఆరోగ్యానికి చాలా మంచిది.. ఇందులో విటమిన్లు, బీటా కెరోటిన్, యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.. ఇది గుండె ఆరోగ్యానికి సహాయపడుతుందని.. అందుకే ప్రతి ఒక్కరూ తినాలని డైటీషియన్లు సూచిస్తున్నారు. సాధారణంగా.. మార్కెట్లో ద్రాక్షను చూసినప్పుడల్లా, ఎంత ఖర్చవుతుందని మనం వెంటనే అడుగుతాము. ద్రాక్షకు అంత ఆహ్లాదకరమైన రుచి ఉంటుంది. ద్రాక్ష ఆరోగ్యానికి ఎంత ప్రయోజనకరంగా ఉంటుందో.. అంతే ప్రమాదకరమైనది కూడా కావచ్చు. ఈ వ్యాధులు సమస్యలతో బాధపడేవారు ద్రాక్ష తినకూడదని పేర్కొంటున్నారు. ద్రాక్షలో అధిక స్థాయిలో చక్కెర ఉంటుంది.. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు హానికరం. అందువల్ల, వారు ద్రాక్షను పెద్ద పరిమాణంలో తినకూడదు. మీరు మధుమేహ వ్యాధిగ్రస్తులు, మీ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించాలనుకుంటే, ద్రాక్షను నివారించడం మంచిది.ద్రాక్షలో కరగని ఫైబర్ ఉంటుంది. వీటిని ఎక్కువగా తినడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు వస్తాయి. వాటిలోని చక్కెర కంటెంట్ విరేచనాలకు కారణమవుతుంది. వాటిలోని ఫైబర్ కడుపులో కరగదు కాబట్టి, జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. మూత్రపిండాల్లో రాళ్లు లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు ద్రాక్షకు దూరంగా ఉండాలి. నల్ల ద్రాక్ష రసం తాగడం వల్ల శరీరంలో పొటాషియం శాతం పెరుగుతుంది. ఇది మూత్రపిండాల సమస్యలు లేదా హైపర్‌కలేమియా ఉన్నవారికి హానికరం. ద్రాక్షలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి.. కాబట్టి ఎక్కువగా తినడం వల్ల బరువు పెరుగుతుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు, బరువు తగ్గాలనుకునేవారు, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు ద్రాక్షకు దూరంగా ఉండాలి. మీరు వాటిని తినాలని భావిస్తే, మీరు వైద్యుడి సలహా తీసుకోవచ్చు. వాటిని ఎక్కువగా తినడం కంటే మితంగా తినడం మీ ఆరోగ్యానికి మంచిది.

## జీడిపప్పు ఎక్కువ తింటే ప్రమాదమా?



ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన జీడిపప్పును మన ఆహారంలో తరచూ తీసుకుంటూ ఉంటాం. అయితే, జీడిపప్పును ఎక్కువగా తీసుకోవడం పలు సమస్యలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు జీడిపప్పును ఎక్కువగా తీసుకోకపోవడం మంచిందని అంటున్నారు. జీడిపప్పును మితంగా తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిదంటున్నారు. జీడిపప్పు, బాదం, పిస్తా, కిస్మిస్ లాంటి డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతుంటారు. డ్రైఫ్రూట్స్ రుచికరంగా ఉండటంతోపాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ కారణంగానే వీటి ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ సంపన్నుల నుంచి సామాన్య ప్రజల వరకు వీటిని తమ ఆహారంలో తీసుకుంటున్నారు. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. జీడిపప్పును చాలా మంది తమ వంటకాల్లో వినియోగిస్తుంటారు. పాయసం తోపాటు వెజ్, నాన్ వెజ్ పులావ్, బిర్యానీ, స్వీట్లు, బిస్కెట్లు, కేకులు, టాపింగ్ ఐస్‌క్రీమ్స్ లాంటి ఆహార పదార్థాల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. కొందరు జీడిపప్పును మాసాల పొడి లేదా కారం లేదా మిరియాల పొడితో నెయ్యిలో వేయించి సేవిస్తారు. ఇలా చాలా రకాలుగా జీడిపప్పును తమ ఆహార పదార్థాల్లో తీసుకుంటూ వాటి ప్రయోజనాన్ని శరీరానికి అందిస్తుంటారు. జీడిపప్పు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్య నిపుణులు చెబుతారు. అంతేగాక, శరీర జీవక్రియను పెంచుతాయి. జీడిపప్పులో మోనోఅన్శాజురేటెడ్, పాలీఅన్శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. వీటితో గుండె ఆరోగ్యానికి ప్రయోజనమే ఉన్నప్పటికీ.. హృదయ సంబంధిత వ్యాధులు ఉన్నవారు మాత్రం జీడిపప్పును ఎక్కువగా తీసుకోకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పలు ఆరోగ్య సమస్యలు కారణమవుతుందని చెబుతున్నారు. జీడిపప్పు ఆరోగ్యకరమైనది అయినప్పటికీ మితంగా తింటేనే మంచిదని అంటున్నారు. జీడిపప్పును తక్కువ మొత్తంలో తరచూ తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యానికి ఎంతో మేలు అని చెబుతున్నారు. కాగా, ప్రతీ సంవత్సరం నవంబర్ 23న జీడిపప్పు దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ ఆచారం మొదట అమెరికాలో ప్రారంభమైంది. జీడిపప్పు చెట్టు ఈశాన్య బ్రెజిల్‌లో పుట్టిందని చెబుతుంటారు. జీడి పప్పు రైతులను గౌరవించేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుతారు. సాధారణంగా జీడిపప్పు చెట్టు జీవితకాలం 60 ఏళ్లు. జీడిపప్పు నాటిన మూడేళ్లలోపు దిగుబడిని ఇవ్వడం ప్రారంభిస్తుంది. గరిష్ట పంటకు ఎనిమిదేళ్లు పట్టవచ్చు.

## అల్లంతో ఆరోగ్య ప్రయోజనాలు



శీతాకాలంలో చాలా మంది అనేక అనారోగ్య సమస్యలకు గురవుతుంటారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తొందరగా జబ్బుల బారినపడుతుంటారు. శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల జీర్ణ సమస్యలు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల శీతాకాలంలో రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. వాటిలో ముఖ్యంగా అల్లం తీసుకుంటే ఎంతో మంచిది.శీతాకాలంలో చాలా మంది అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తొందరగా జబ్బుల బారినపడుతుంటారు. శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల జీర్ణ సమస్యలు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల శీతాకాలంలో రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. వాటిలో ముఖ్యంగా అల్లం తీసుకుంటే మంచిది. అల్లంను టీలో మాత్రమే కాకుండా ఇతర ఆహార పదార్థాలకు కూడా జోడించి ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు. అల్లం శీతాకాలంలో వచ్చే జీర్ణ సమస్యల నుంచి మనల్ని కాపాడుతుంది. వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతుంది. అంతేగాక, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. అందుకే మధుమేహ వ్యాధి బాధితులకు ఇదొక వరమనే చెప్పాలి. అయితే, డయాబెటిస్ ఉన్న వ్యక్తులు అల్లంను మితంగా తీసుకోవాలి. రోజుకు 5 గ్రాములు తీసుకుంటే చాలు. రక్తంలో చక్కరను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ ఉత్పత్తిని నియంత్రిస్తుంది. ఇక అల్లంలో ఉండే యాంటీఆక్సిడెంట్స్ లక్షణాలు పుష్కలంగా ఉండటంతో మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శీతాకాలంలో వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. వృద్ధులు తగినంత అల్లం తీసుకోవడం వారి ఆరోగ్యానికి మంచిది. శరీర నొప్పులు, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి సమస్యల నుంచి వృద్ధులకు ఉపశమనం కలిగిస్తుంది. అల్లం కలిపిన మిశ్రమాలు తీసుకోవడం వల్ల శరీరం శక్తివంతం అవుతుంది. వ్యాధులు రాకుండా అడ్డుకుంటుంది.

## రైస్ ఇలా వండితే.. అన్నం తిన్నా షుగర్ కంట్రోల్!



డయాబెటీస్ ఉన్న వారు, అధిక బరువు ఉన్నవారు అన్నం తినాలంటేనే భయపడిపోతుంటారు. ఎందుకంటే అన్నంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. దీనిని తినడం వల్ల బాడీలో కార్బోహైడ్రేట్స్ పెరిగి బరువుతో పాటు షుగర్ లెవల్స్ కూడా పెరుగుతాయని వాళ్ల టెన్షన్.. అయితే అలాంటి వారికే ఈ గుడ్‌న్యూస్.. అన్నం తిన్నా మీ బాడిలో షుగర్‌ను కంట్రోల్ ఉంచుకోవచ్చు. అన్నం తినడం వల్ల శరీరంలో కార్బోహైడ్రెడ్స్ పెరుగుతాయన్న మాట వాస్తవమే.. కానీ కొన్ని చిట్కాలను పాటించడం వల్ల వాటి పెరుగుదలను నెమ్మది చేయవచ్చు. దానితో పాటు మీ బాడిలో షుగర్‌తో పాటు బరువు పెరగడాన్ని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. ఇందుకు మీరు పెద్దగా కష్టపడాల్సి అవసరం కూడా లేదు. కేవలం అన్నం వండేటప్పుడు అందులో కొన్ని బెండకాయలు, లేదా బంగాళాదుంపలు వేసుకుంటే సరిపోతుంది. దీని వల్ల అన్నం త్వరగా అవ్వడమే కాకుండా ఔషధంలా మారుతుంది. ఇది మేము చెబుతున్న విషయం కాదు.. వైద్య నిపుణులు డాక్టర్ సంతోష్ జాకోబ్ తన ఇన్‌స్ట్రాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఇలా అన్నంలో బెండకాయలు కలిపి వండుకొని తినడం ద్వారా మన బాడిలో షుగర్ లెవల్స్ పెరగకుండా కంట్రోల్‌లోనే ఉంటాయట.

ధర్మఘంట

# రైతుల అవసరాలకు తగిన రుణాలు అందించాలి

## అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్

**కరీంనగర్ :** రైతుల అవసరాలకు తగిన విధంగా బ్యాంకర్లు రుణాలు అందించాల్సిన అవసరం ఉందని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ రెవెన్యూ పేర్కొన్నారు. 2026–27 సంవత్సరానికి సంబంధించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేయడంపై శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో కరీంనగర్ జగిత్యాల సిరిసిల్ల పెద్దపల్లి జిల్లాలకు సంబంధించిన జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ డిస్టిక్ లెవెల్ టెక్నికల్ కమిటీ, సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ,లక్ష్మీ కిరణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ను బ్యాంకర్లు వివిధ శాఖల అధికారులు నిర్ణయించాలని సూచించారు. పంటల సాగులో ఖర్చులు పెరిగిన దృష్ట్యా గత సంవత్సరం కంటే సేల్ ఆఫ్ ఫైనాన్స్ ను కొంతవరకు పెంచాలని అభిప్రాయపడ్డారు వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు గోధుమలు కూరగాయలు చిరుతృణధాన్యాలు జొన్న రాగులు, నగదు పంటలకు అధిక రుణ పరిమితినీ కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, రైతులకు రుణాల మంజూరు, ఫైనాన్సింగ్ విధానం తదితర




అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయా పంటలకు సంబంధించి పంటల సాగులో పెట్టుబడులు ఆదాయము తో పాటు వివిధ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో 20 మంది రైతులు పాల్గొని సేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచే అంశంపై వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమావేశంలో డీసీసీబీ సీఈఓ సత్యనారాయణ రావు కరీంనగర్ ఎల్డిఎం ఆంజనేయులు జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి పెద్దపల్లి, సిరిసిల్ల జగిత్యాల జిల్లాల నాబార్డ్ అధికారులు వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక మత్స్య శాఖ అధికారులు కేడిసిసి బి అధికారులు, బ్యాంకర్లు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**పదవ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఎంఐఎం పార్టీ తరఫున స్టడీ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్**

**కోరుట్ల :** మైనారిటీ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే నాంపల్లి మాజీద్ హుస్సేన్ అన్నారు. పట్టణంలోని కింగ్స్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాలార్ ఏ మిల్లత్ ఆల్ ఇన్ వన్ (ఆల్ సబ్జెక్ట్స్ మోడల్ పేపర్ సిరీస్) పదవ తరగతి ఉర్దూ మీడియం మైనారిటీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి మజిలీస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే నాంపల్లి (హైదరాబాద్) మాజీద్ హుస్సేన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎం.ఐ.ఎం పార్టీ అధ్యక్షులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం పార్టీ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొంటూ ప్రసంగించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ ఎం.ఐ.ఎం పార్టీ తరఫున పార్టీ అధ్యక్షులు కీర్తిశేషులు సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ దాదాపు 25 సంవత్సరాల క్రితం మైనార్టీ ఉర్దూ మీడియం పదవ తరగతి విద్యార్థులు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అప్పటినుండి యధావిధిగా పదవ తరగతి ఉర్దూ మీడియంలో చదువుతున్న ప్రతి విద్యార్థిని విద్యార్థులకు సాలార్ ఎ మిల్లత్ ఆల్ ఇన్ వన్ మోడల్ పేపర్ సిరీస్ పంపిణీ చేస్తూ లక్షలాది మంది విద్యార్థులు విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలలో అధిక మార్కులు సాధించి ఉత్తర్ణియులు అవ్వడానికి ఉపయోగపడేలా పార్టీ తరఫున సహాయం చేయడం జరుగుతున్నదని అన్నారు. ఎంఐఎం పార్టీ తరఫున ఇచ్చే కానుకను విద్యార్థిని విద్యార్థులు ఉపయోగిస్తూ రాబోయే పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన కోరారు అలాగే విద్యార్థులు తమ ఎక్కువ సమయం పుస్తకాలు చదువుతూనే గడపాలని మొబైల్ ఫోన్ కి దూరం ఉంటూ చదువు పైనే పూర్తిగా దృష్టి సాధించాలని ఆయన కోరారు. నేడు భారతదేశంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధికై కేవలం ఎంఐఎం పార్టీ కృషి చేస్తుందని, ఎంఐఎం పార్టీ కేవలం తెలంగాణ, రాష్ట్రానికి మాత్రమే పరిమితం కాకుండా ఆంధ్ర, మహారాష్ట్ర, యూపీ, బీహార్, ఇతర రాష్ట్రాల్లో తమ సేవలను





అందిస్తూ ముస్లిం మైనారిటీ మరియు బడుగు బలహీన వర్గాల ప్రజల కు పార్టీ రాజకీయ సేవలు అందిస్తూ వస్తుందని అన్నారు ప్రజలు ఎంఐఎం పార్టీ సేవా కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఆనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ తరఫున కేవలం హైదరాబాద్ సిటీ ప్రాంగణంలోనే కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఉందని అన్నారు. పార్టీ తరఫున ఉర్దూ మీడియం పదవ తరగతి విద్యార్థులు విద్యార్థులకు ఇచ్చే కానుక సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ మోడల్ పేపర్ సిరీస్ ఎంతో ఉపయోగకరమైనది నీ దీనిని చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవుతారని ఆయన అన్నారు దీని రూపకల్పన కొరకు మంచి అనుభవంతో కూడిన ఉపాధ్యాయులు, విద్యావంతుల, స్కాలర్స్, చే తయారు చేయబడినది కాబట్టి ఈ మోడల్ పేపర్ సిరీస్ చాలా ఉపయోగకరమైనదని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆనంతరం ఎంఐఎం పట్టణ అధ్యక్షులు ఎంఏ రఫీ మాట్లాడుతూ పట్టణంలో విద్యార్థులు చాలా మది పార్టీ తరఫున పంపిణీ చేస్తున్న సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ మోడల్ పేపర్ సిరీస్ ను చదువుకొని అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులై ఉన్నత స్థాయికి ఎదిగారని దీనికి ఎంఐఎం అధ్యక్షులు బేరిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ సీనియర్ పార్లమెంట్ సభ్యులు, అక్బరుద్దీన్ ఓవైసీ సీనియర్ శాసనసభ్యులు లకు కృతజ్ఞతలు తెలిపారు.. అలాగే కోరుట్ల పట్టణంలో విద్యార్థులు విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు సహాయ సహకారాలు ఎంఐఎం పార్టీ తరఫున కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు, పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఎంఐఎం పార్టీ నాయకులు తన నాయకత్వంలో వెళ్లి అక్కడ విద్యార్థుల విద్యార్థుల కు ఎదురవుతున్న సమస్యలను వారితో కలిసి తెలుసుకొని అసదుద్దీన్ ఓవైసీ అధ్యక్షులు ఎంఐఎం పార్టీ దృష్టికి తీసుకొచ్చి ఆయన సహకారంతో ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగింది దీనితో ప్రభుత్వ పాఠశాలలలో నిధులు మంజూరు అవుతూ వివిధ పాఠశాలలలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.. రాబోయే కాలంలో ఎంఐఎం పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం తమ పార్టీ ప్రజా ప్రతినిధులు విద్యార్థులకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, జగిత్యాల,కోరుట్ల,మెట్ పల్లి, కి చెందిన ఎంఐఎం పార్టీ నాయకులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎం.ఐ.ఎం పార్టీ అధ్యక్షులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, కోరుట్ల పట్టణ అధ్యక్షులు ఎంఏ రఫీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ వాజిద్, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ రజీ నాయకులు సమీర్, మొహమ్మద్ ముజాహిద్ ఖాన్, అబ్దుల్ హఫీజ్ ఖురేషి మొహమ్మద్ సల్మాన్, రషీద్, మొహమ్మద్ అక్బర్, మహమ్మద్ సమీర్, తల్హా ఆసీం, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ మున్సిపల్ కౌన్సిల్‌పై ఎంఐఎం జెండా ఎగురవేస్తాం

**8 మంది కౌన్సిలర్లను గెలిపిస్తే జగిత్యాల తిరుగులేని శక్తిగా ఎంఐఎం పార్టీ**

**నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్**

**జగిత్యాల :** తెలంగాణ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న ఎంఐఎం పార్టీదే మాత్రమే సూపర్ పవర్ అని, ఎంఐఎం మద్దతు లేనిదే ఆకు కూడా కదలదని, రాష్ట్ర రాజకీయాల్లో ఎంఐఎం పార్టీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తులో ఎంఐఎం పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా శ్రమించాలని, హైదరాబాద్ నాంపల్లి ఎమ్మెల్యే, యూత్ ఐకాన్ మాజీద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ని ఒక ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సదస్సులో మాజీద్ హుస్సేన్ మాట్లాడారు. ఈ దేశం అందరిదని ఈ దేశంలో అందరికీ సర్వసమాన హక్కులు ఉన్నాయని, ఎంఐఎం పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ దేశవ్యాప్తంగా దళిత, ముస్లింల అభ్యున్నతి కోసం బడుగు బలహీన వర్గాల గొంతుకగా పార్లమెంట్ వేదికగా పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో ఏమూలకు ఎలాంటి అన్యాయం జరిగిన పేదల పక్షాన పార్లమెంట్లో అధికార పక్షాన్ని నిలదీసిన దమ్మున్న నాయకుడు బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ అని పేర్కొన్నారు. అందుకే ఎంఐఎం పార్టీని దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు నమ్ముతూ పార్టీని ఆదరిస్తున్నారని చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల నుంచి 10 స్థానాల్లో ఎంఐఎం పార్టీ పోటీ చేయబోతుందని, కనీసం 8స్థానాల్లో విజయం సాధించి మున్సిపల్ కౌన్సిల్ పై ఎంఐఎం పార్టీ జెండా



ఎగురవేస్తామన్నారు. పేదల అభ్యున్నతి కోసం, దళిత, ముస్లిం, బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా సమాజ హితం కోసం ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ నగరంలో ఎంఐఎం పార్టీలో నిబద్ధత కలిగిన వ్యక్తులకు, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే యువకులకు, ఎంఐఎం పార్టీలో ఎప్పుడు తలుపులు తెరిచి ఉంటాయని చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలను అన్వేషించి, పార్టీ ద్వారా ప్రత్యేక టీమ్ తో సర్వే నిర్వహించి, సర్వే ఆధారంగా, ప్రజా మద్దత్తు ఉన్న నేతకు, ప్రజలు కోరుకున్న వారికి టికెట్లు కేటాయిస్తామన్నారు. ఆయా డివిజన్లో మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే కౌన్సిలర్ టికెట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో జగిత్యాల, కరీంనగర్ ఎంఐఎం పార్టీ నాయకులు, సుమీరుద్దీన్ ఆజాద్, మాజీ కౌన్సిలర్ రాజి,శానవాసం ఖాన్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత వారోత్సవ భాగంలో ఆర్‌టీసి డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం

**హైదరాబాద్ :** రోడ్డు భద్రత వారోత్స వం భాగం లో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు ఏ సి పి ఆదేశాల తో బర్కతపురఆర్ టీ సి డిపో లో మేనేజర్ మంజులతో కలిసి డ్రైవర్ లకు రోడ్డు భద్రత పై ముఖ్య సూచనలు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఎస్ ఐ లు శ్రీకాంత్ ఆర్ ఎస్ ఐ తో పాటు రాకేష్ లు పాల్గొని డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు. ముఖ్యం గా రోడ్డు పై కనురెప్పపాటున జరిగే ప్రమాదలను దృష్టిలో పెట్టుకుని, ప్రయాణికులను, కుటుంబ సభ్యులను అందరి గురించి ఆలోచించాలని కాగా బస్సు నడిపించే టప్పుడు సెల్ ఫోన్లో మాట్లాడవద్దని అన్నారు. అనంతరం డి ఏం మాట్లాడుతూ సంస్థ మనుగడ కోసం నిరంతరం శ్రామిస్తున్న కార్మికులు మీకుటుంబాలను, ప్రయాణికులభద్రతే మనకు ముఖ్యం అని అన్నారు. ఈ సదస్సు లో అధికారులు విజయ లక్ష్మి తో పాటు పలు వూరు డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామికులు పాల్గొన్నారు.

## ఇర్కోడ్ లిఫ్ట్ పనులు పూర్తి చేయండి

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలోని మల్లన్న సాగర్ ద్వారా మూడు నియోజకవర్గాలకు సాగు నీరు అందించే ఇర్కోడ్ లిఫ్ట్ పథకం. ఇర్కోడ్ లిఫ్ట్ పూర్తి అవుతే 17వేల ఎకరాలకు సాగు నీరు వస్తుంది21 గ్రామాలకు, 10వేల మంది రైతు కుటుంబాలకు మేలు జరుగుతుంది.రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి లేఖ వ్రాసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. సిద్దిపేట మరియు దుబ్బాక నియోజకవర్గాల్లోని బీడు భూములను సస్యశామలం చేయడానికి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా శ్రీ కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మించడం జరిగింది. అందులో భాగంగా ఇర్కోడ్ లిఫ్ట్ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని పనులు వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ వ్రాసారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్ పరిధిలో 2020 సంవత్సరం నుండి కొత్త ఆయకట్టును సృష్టించుకున్నామని. అయితే సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లో రిజర్వాయర్ మట్టానికి ఎత్తులో ఉన్న 17,377 ఎకరాల భూమికి సాగు నీరు అందడం లేదని దీనికోసం మా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇర్కోడు లిఫ్ట్ పనులను చేపట్టామని పేర్కొన్నారు. 2023 వరకు 95శాతం పనులు పూర్తి చేశాం. మరో 5శాతం పంపు హౌస్ పనులు మాత్రమే మిగిలిఉన్నాయని. ఈ లిఫ్ట్ పనులను పూర్తిచేస్తే సిద్దిపేట నియోజకవర్గం లోని 6 గ్రామాలు, 4వేల 244 ఎకరాల ఆయకట్టు, దుబ్బాక నియోజకవర్గం లో 13గ్రామాలు 11వేల 607 ఎకరాల అయకట్టు, గజ్వేల్ నియోజకవర్గం లో రెండు గ్రామాలు 1526 ఎకరాల ఆయకట్టు మొత్తం 21 గ్రామాలు 17 వేల 377 ఎకరాల ఆయకట్టు కు సాగు నీరు అందుతుంది,దాదాపు 10వేల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.. బీడు భూములు పచ్చదనాన్ని సంతరించుకుంటాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగు అని పదేపదే మీరు చెబుతున్న మాటలు నిజం కావాలంటే ఇర్కోడు లిఫ్ట పనులను వెంటనే చేపట్టి రైతు లకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు

## మహిళను దుర్భాషలాడిన కండకర్ట్‌పై వేటు

**హైదరాబాద్ :** ఆర్టీసీ బస్సులో మహిళను దుర్భాషలాడుతూ అసభ్యంగా మాట్లాడిన హయత్ నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రశాంత్ ను డిపో మేనేజర్ శ్రీనివాసరావు విధుల నుండి తొలగించారు. ఔట్ సోర్సింగ్ లో గత నెల రోజుల క్రితం ప్రశాంత్ అనే కండక్టర్ విధుల్లో చేరాడు. బుధవారం నాడు చాదర్ఘట్ సమీపంలో చౌరస్తా వద్ద బస్సు ఆపమని అడిగినందుకు కండక్టర్ ఆపడం కుదరదని చెప్పటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మహిళ ను అసభ్యంగా మాట్లాడడంతో మాకు వచ్చిన వీడియో ఆధారంగా కండక్టర్ను సర్వీస్ నుంచి తొలగించినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు...

## మేడ్చల్ ఆర్టీయే కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాలు

**కుత్బుల్లాపూర్ :** మేడ్చల్ జిల్లా రవాణా శాఖ ఆద్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ఈ నెల01 వ తేది నుండి 31 వరకు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం నాడు మేడ్చల్ జిల్లా రవాణాశాఖ కార్యాలయ ఆవరణలోవాహన వినియోగ దారులచేత రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. నేను భారతదేశ పౌరుడిగా, మోటారు వాహనముల చట్టంలో పొందుపరచిన రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తానని, ఇతరులకు శ్రేయస్సుని, తోటి రోడ్డు వినియోగదారులను గౌరవిస్తానని, రోడ్డు ప్రమాదములు జరగకుండా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణశుద్ధితో నిర్వహిస్తానని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించనని, ప్రయాణం గాని లేకుండా ప్రజలందరూ మన రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి సహకరిస్తానని దృఢసంకల్పంగా ప్రమాణం చేస్తున్నానని ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాల దారులకు,,హెల్మెట్ ప్రాదాన్యతనిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించి,రోడ్ల పై వాహనాలు నడిచేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని, ఒకవేళ డ్రైవింగ్ చేసేవారికి నిద్ర వస్తే ఒక ప్రక్కనే ఆపి తర్వాత ప్రయాణం కొనసాగించాలని,, ముఖ్యంగా మైనర్లుకు వాహనాలు ఇవ్వద్దని, ప్రతి ఒక్కరూ భాద్యతతో రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించాలని లేకపోతో ఒక నిండు ప్రాణాలు బలైపోతే కుటుంబం మొత్తం అనాదలౌతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు సిబ్బంది , వాహన దారులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

## మద్యం మత్తులో ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులు మృతి

**ఒకరికి తీవ్ర గాయాలు...**

**రంగారెడ్డి :** మహేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుచ్చిరెడ్డి పౌల్ట్రీ ఫార్మ్ దగ్గర మద్యం మత్తులో టవేరా వాహనాన్ని నడుపుతూ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో,తవుటి శ్రీకాంత్,సంగెం గిరి,అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ దుర్ఘటన లో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మహేశ్వరం పోలీసులకు సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఇలాంటి దుర్ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు భద్రతపై అవగాహన లు కల్పించిన. వినకుండా మద్యం సేవించి ప్రాణాలు కోల్పోతున్నారు మహేశ్వరం పోలీసులు తెలిపారు. ఒకేసారి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో పోరండ్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మెడిసిటీ హాస్పిటల్ సహకారంతో సత్య సుందర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 5,6 తేదీల్లో ఉచిత మెగా వైద్య శిబిరం

**హైదరాబాద్ :** మెడిసిటీ హాస్పిటల్తో కలిసి, జనవరి 5, 6 తేదీలలో హైదరాబాద్లోని చుడీ బజార్లో ఉన్న సనాతన ధర్మ భవన్లో తమ రెండో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సత్య సుందర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ప్రకటించింది. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల పేద వర్గాల వారికి ఉచిత, సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలను అందించ డమే ఈ శిబిరం లక్ష్యమని బంజారాహిల్స్లో జరిగిన మీడియా సమావేశంలో సంస్థ నిర్వాహకులు తెలిపారు. మెడిసిటీ హాస్పిటల్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇనిష్ మర్చంట్ మాట్లాడుతూ, శిబిరంలో గుర్తించిన రోగులకు తమ ఆసుపత్రి పూర్తి వైద్య, రోగ నిర్ధారణ, శస్త్రచికిత్స సహాయాన్ని అందిస్తుందని అన్నారు. సత్య సుందర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఠాకూర్ గోపాల్ సింగ్ మాట్లాడుతూ, ప్రారంభ రోగ నిర్ధారణ, సకాలంలో చికిత్స, పేదలకు ఆరోగ్య సంరక్షణకు ఆర్థిక అడ్డంకులను తొలగించడంపై ఈ కార్యక్రమం దృష్టి సారిస్తుందని అన్నారు.

## బిజినెస్

# పెట్రోల్ కన్నా విమాన ఇంధనమే చౌక

### 2025లో రూపాయి 4.7 శాతం పతనం



అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ వరుసగా రెండో నెలలోనూ పతనమయ్యింది. డిసెంబరులోనూ నష్టంతో ఈ ఏడాదిని ముగించింది. చివరి నెలలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారత దేశ చరిత్రలోనే 91 స్థాయిని దాటి ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 89.87 వద్ద ముగిసింది. ఈ నెలలో స్థూలంగా 0.5 శాతం విలువ కోల్పోయింది. 2025 ఏడాదిలో మొత్తంగా రూపాయి విలువ 4.7 శాతం క్షీణించింది. ఇది గత మూడేళ్లలో నమోదైన అతిపెద్ద వార్షిక పతనం కావడం ఆందోళనకరం. ఈ ఏడాది పొడవునా రూపాయిపై ప్రభావం చూపిన అంశాలే డిసెంబరులోనూ కొనసాగాయి. భారతీయ ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహరించుకోవడం, దిగుమతిదారులు హెడ్జింగ్‌ను పెంచడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోవడం వంటివి రూపాయి పతనానికి కారణమయ్యాయి. "విదేశీ ఇన్వెస్టర్ల నిరంతర నిధుల ఉపసంహరణ, రక్షణ, చమురు, బంగారం రంగాల నుండి డాలర్ డిమాండ్ అన్నీ రూపాయిపై ప్రభావాన్ని చూపుతున్నాయి," అని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్‌కు చెందిన ట్రెజరీ హెడ్ అనిల్ భన్సాలీ తెలిపారు.

### వెనక్కి తగ్గిన లోక్‌పాల్



బీఎండబ్ల్యూ కార్ల టెండర్ విషయంలో లోక్‌పాల్ వెనక్కి తగ్గింది. ఒక్కొక్కటి రూ.70 లక్షల విలువైన ఏడు బీఎండబ్ల్యూ కార్ల కొనుగోలుకు టెండర్ ఆహ్వానించడంపై విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌పాల్ ఆ కార్ల టెండర్‌ను రద్దు చేసింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలను వెల్లడించాయి. లోక్‌పాల్ చైర్మెన్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఖాన్విల్కర్ సహా ఏడుగురు జ్యుడీషియల్, నాన్-జ్యుడీషియల్ సభ్యుల కోసం కొన్ని నెలల క్రితం లోక్‌పాల్ బీఎండబ్ల్యూ కార్ల టెండర్‌ను ఆహ్వానించింది. అయితే ఎంపికైన విక్రయదారు బీఎండబ్ల్యూ కార్లను నడిపే విధానంపై ఏడు రోజులు తమ డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని, ఈ ఖర్చును కూడా వారే భరించాలని షరతు విధించింది. దీంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే మోడీ ప్రభుత్వంలో లోక్‌పాల్ పనితీరేంటో తేలిపోయిందని, అవినీతిపై పోరాడాల్సింది పోయి విలాసవంతమైన కార్ల కొనుగోలుకు లోక్‌పాల్ సిద్ధమైందని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.




కొత్త ఏడాది ప్రారంభం రోజే విమానయాన కంపెనీలకు కేంద్రం బంఫర్ ఆఫర్ ప్రకటించింది. విమానాలకు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) ధరలను భారీగా తగ్గించింది. సాధారణ ప్రజలు ఉపయోగించే పెట్రోల్, వాహనాలు ఉపయోగించే డీజిల్ కంటే జెట్ ఇంధనాన్ని మరింత చౌకగా మార్చడం గమనార్హం. మరోవైపు వాణిజ్య వంట గ్యాస్ ధరను పెంచింది. ఢిల్లీలో ఎటిఎఫ్ ధర కిలోలీటర్‌పై (1000 లీటర్లు) రూ.7,353.75 తగ్గించి రూ.92,323.02కి కోత పెట్టింది. దీంతో లీటర్‌పై రూ.7.35 తగ్గించి రూ.92.32గా ప్రకటించినట్లయ్యింది. ఇది విమాన యాన సంస్థలకు భారీ లాభాలను చేకూర్చనుంది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.41గా ఉండగా.. విజయవాడలో రూ.109.63గా ఉంది. పెట్రోలుతో పోల్చితే విమానాలకు ఉపయోగించే ఎటిఎఫ్ కారుచౌకగా ఉండటం విశేషం. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రో ధరలు తక్కువగా ఉన్నప్పటికీ, సర్ ఛార్జీలతో సామాన్యులపై కేంద్రప్రభుత్వం భారం మోపుతోంది. పెట్రోల్ వ్యయం పెరగడంతో మధ్యతరగతి, దిగువ తరగతి ప్రజల నెలవారీ ఖర్చులు పెరుగుతున్నాయి. ఇతర విద్యా, ఆరోగ్యం, ఆహారానికి కేటాయించే ఖర్చులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఐదు కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పిజి (ఎఫ్‌టిఎల్) సిలిండర్లపై కూడా ధరలను కేంద్రం రూ.27 పెంచింది. కొత్త ఏడాదిలో హోటల్ యజమానులకు మోడీ సర్కార్ భారీ షాక్ ఇచ్చింది. 19 కిలోల వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ధరను రూ.111 పెంచింది. దీంతో ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.1,681.50కి చేరింది. హైదరాబాద్‌లో దీని ధర రూ.1,912.50 ఉంది. విజయవాడలో గతంలో రూ.1750గా ఉన్న ధర ఇప్పుడు రూ.1862కి, విశాఖలో రూ.1650గా ఉన్న ధర రూ.1751కి పెరిగింది. కర్నూలులో రూ.1775గా ఉన్న ధర రూ.1885.50కి చేరుకుంది. వాణిజ్య ఎల్‌పిజి ధరల్లో చేసిన సవరణల కారణంగా వాటిపై ఆధారపడుతూ వ్యాపారాలు చేసుకునే వారిపై ఆర్థిక భారం పడనుంది. ఆ భారాన్ని యాజమాన్యాలు అంతిమంగా వినియోగదారులపైనే నెట్టుతాయి. హడావిడిగా పనుల కోసం, ఉద్యోగాల కోసం వెళ్లి, బయట ఆహారం కొనుగోలు చేసే సామాన్యులు గ్యాస్ ధరల పెంపుతో మరింత అధికంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

### కొత్త సంవత్సరంలో బిగ్ షాక్..
### రూ. 111 పెరిగిన సిలిండర్ ధర



గత కొద్ది నెలలుగా స్థిరంగా ఉంటున్న గ్యాస్ సిలిండర్ ధరలను (ఉజీబ ఇ-ఎశ్రీతినిటవతీ జూతీతిఇ-వబ) ఆయిల్ కంపెనీలు భారీగా పెంచాయి. నూతన సంవత్సర వేళ వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ చమురు మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. నేటి నుంచి (జనవరి 1) అమల్లోకి వచ్చేలా 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ (ఒఖఉ) సిలిండర్ ధరను రూ. 111 పెంచాయి. ఈ పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ. 1691.50 కి చేరుకుంది. అలాగే రాష్ట్ర రాజధాన హైదరాబాద్ నిన్నటి వరకు 1595.50కి లభించగ.. పెరిగిన ధరతో నేటి నుంచి రూ. 1706. 50 లకు ధరకు అందుబాటులో ఉంది. కేవలం కమర్షియల్ సిలిండర్లనే కాకుండా, 5 కిలోల ఎఫ్‌టిఎల్ (ఈఒఖ) సిలిండర్ల ధరను కూడా రూ. 27 పెంచుతున్నట్లు కంపెనీలు ప్రకటించాయి. ఇదిలా ఉంటే కొత్త సంవత్సరం వేల దేశంలోని సామాన్య ప్రజలకు ఊరటనిస్తూ 14.2 కిలోల గృహ వినియోగ (ఆనీఎవబబితిఇ) ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో మాత్రం ఆయిల్ కంపెనీలు ఎటువంటి మార్పు చేయలేదు. కాగా నూతన సంవత్సర ప్రారంభంలోనే వాణిజ్య సిలిండర్ ధరలు పెరగడం హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై అదనపు భారం పడింది.

### పెరుగనున్న సిగరెట్లు, బీడీ, పాన్ మసాలా ధరలు..



సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా ధరలు పెరుగనున్నాయి. వాటిపై జీఎస్టీతోపాటు అదనపు సెస్ విధించనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన ధరలు అమలులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై కొత్త సెస్సు విధించనున్నట్లు పేర్కొంది. కాగా, ఫిబ్రవరి 1 నుంచి పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీ విధిస్తారు. బీడీలపై 18 శాతం జీఎస్టీ ఉంటుంది. అలాగే పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం కూడా విధిస్తారు. పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్సు ఉంటుంది. గతంలో ఉన్న కంపన్‌సేషన్ సెస్సు స్థానంలో ఈ కొత్త సెస్సు అమలు చేస్తారు. మరోవైపు చూయింగ్ టొబాకో, జర్దా సెంటెడ్ టొబాకో, గుట్కా ప్యాకింగ్ యంత్రాలు (సామర్థ్య నిర్ధారణ, సుంకం వసూలు) నియమాలను కూడా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడిచింది. దీంతో వాటి తయారీ మెషిన్స్‌పై కూడా అదనపు పన్నులు ఉంటాయి. అయితే పాన్ మసాలా తయారీపై కొత్తగా ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్, పొగాకుపై ఎక్సైజ్ సుంకాన్ని విధించడానికి అనుమతించే రెండు బిల్లులను డిసెంబర్‌లో పార్లమెంట్ ఆమోదించింది.

## స్పోర్ట్స్

# బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా..
# వన్డే, టీ20 సిరీస్ తేదీలు ఇవే..!



భారత్, బంగ్లాదేశ్ వైట్‌బాల్ సిరీస్ కొత్త తేదీలు వచ్చేశాయి. పొరుగుదేశంలో నిరుడు ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాయిదా పడిన సిరీస్ సెప్టెంబర్ నెలలో జరునుంది. ఈ విషయాన్ని శుక్రవారం బంగ్లాదేశ్ బోర్డు అధికారికంగా వెల్లడించింది. గతేడాది ఆగస్టులో వాయిదా పడిన బంగ్లాదేశ్, టీమిండియా వైట్‌బాల్ సిరీస్ తేదీలను రీషెడ్యూల్ చేశాం. సెప్టెంబర్‌లో బంగ్లా పర్యటనకు భారత జట్టు రానుంది అని బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ చీఫ్ షహరీర్ నఫీజ్ తెలిపాడు. కొత్త ఏడాదిని పురస్కరించుకొని శుక్రవారం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 2026లో అంతర్జాతీయ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్, న్యూజిలాండ్, భారత్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌తో ద్వైపాక్షిక సిరీస్ తేదీలను బీసీబీ ప్రకటించింది. కొత్త షెడ్యూల్ ప్రకారం భారత జట్టు సెప్టెంబర్‌లో బంగ్లాలో వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం భారత బృందం ఆగస్టు 28న బంగ్లాకు వెళ్లనుంది. అనంతరం సెప్టెంబర్ 1న తొలి వన్డేతో సిరీస్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 3న రెండో వన్డే, సెప్టెంబర్ 6న మూడో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును టీమిండియా ఢీకొడుతుంది. అనంతరం సెప్టెంబర్ 9 నుంచి ఇరుజట్ల మధ్య టీ20 సిరీస్ షురూ అవుతుంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో సిరీస్ ముగుస్తుంది.

**అల్లర్ల నేపథ్యంలో..**

నిరుడు ఆగస్టులోనే టీమిండియా వైట్‌బాల్ సిరీస్ కోసం బంగ్లాదేశ్ వెళ్లాల్సింది. షెడ్యూల్ ప్రకారం.. ఆగస్టు 17 నుంచి బంగ్లాదేశ్‌లో భారత్ మూడు వన్డేలు, టీ20 సిరీస్‌లో ఆడాల్సి ఉంది. కానీ, మాజీ ప్రధాని షేక్ హసీనా(రాష్ట్రవఅఎష్ట ఝంఅఖ)కు వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లతో పర్యటనను బీసీసీఐ వాయిదా వేసింది. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాక సిరీస్‌ను నిర్వహించాలని ఇరుదేశాల బోర్డులు భావించాయి. బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడడం.. ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో అక్కడ సాధారణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. అందుకనే కొత్త ఏడాది రెండో రోజునే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వైట్‌బాల్ సిరీస్ తేదీలను ప్రకటించింది.

### ఇంగ్లండ్ స్క్వాడ్‌లో స్పిన్ సంచలనం.. యువ పేసర్‌కు పిలుపు..!



లయాషెస్ సిరీస్‌లో ఎట్టకేలకు బోణీ కొట్టిన ఇంగ్లండ్ విజయంతో సిరీస్‌ను ముగించాలనుకుంటోంది. బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియాకు షాకిచ్చిన బెన్ స్టోక్స్ సేన.. సిడ్నీలోనూ దూకుడే మంత్రగా ఆడనుంది. జనవరి 4న సిడ్నీలో జరుగనున్న చివరి టెస్టు కోసం ఇంగ్లండ్ కీలక మార్పులు చేసింది. ఆ దేశ క్రికెట్ బోర్డు శుక్రవారం 12 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించాలనుకుంటున్న బౌలింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకుంటూ యువ స్పిన్నర్ షోయబ్ బషీర్ మాథ్యూ పాట్స్ (మీఫ్ష్రవష్రాశీం)లకు చోటు కల్పించింది. పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓటమితో యాషెస్ సిరీస్ సమర్పించుకున్న ఇంగ్లండ్ మెల్‌బోర్న్‌లో పంజా విసిరింది. కుర్ర పేసర్ జోష్ టంగ్ విజృంభణతో ఆతిథ్య జట్టును మట్టికరిపించిన బెన్ స్టోక్స్ బృందం.. సిడ్నీ టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. అయితే.. తొడకండరాల గాయంతో బాధపడుతున్న పేసర్ గస్ అట్కిన్సన్ ఐదో టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో మాథ్యూ పాట్స్ ఎంపికయ్యాడు. మెల్‌బోర్న్ ఓటమి నుంచి తేరుకొని విజయ గర్జన చేయాలనుకుంటున్న ఆసీస్ స్టీవ్ స్మిత్ సారథిగా బరిలోకి దిగనుంది. అయితే.. నాలుగో టెస్టు స్క్వాడ్‌లో ఆ దేశ బోర్డు ఏ మార్పులు చేయలేదు.

**ఇంగ్లండ్ తుది జట్టు :** జాక్ క్రాలే, బెన్ డకెట్, బెన్ స్టోక్స్(కెప్టెన్), జో రూట్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), షోయబ్ బషీర్,బ్రైడన్ కార్సే, విల్ జాక్స్, మాథ్యూ పాట్స్, జోష్ టంగ్.

### డ్రాగన్ వేషంలో యూనివర్సల్ బాస్.. కొత్త ఏడాదికి స్వాగతం అదిరింది..!




వెస్టిండీస్ మాజీ ఓపెనర్ క్రిస్ గేల్ ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో ఓ సంచలనం. అతడు క్రీజులోకి వచ్చాడంటే బౌలర్లు వణికిపోయేవాళ్లు. దంచడమే డ్యూటీగా భావించే ఈ డాషింగ్ బ్యాటర్ నెలకొల్పిన రికార్డులు కోకొల్లలు. క్రికెటర్‌గా తన విధ్వంసక ఆటతో అభిమానులను అలరించిన గేల్.. ఈమధ్య తన ప్రత్యేక వేషధారణతో వైరలవుతున్నాడు. కొత్త సంవత్సరం సందర్భంగా ఈ కరీబియన్ వీరుడు డ్రాగన్ వేషంలో.. కార్నివాల్ డాన్స్ వీడియోతో మరోసారి నెట్టింటిని షేక్ చేస్తున్నాడు. ఆల్‌టైమ్ దిగ్గజ ఓపెనర్లలో ఒకడైన క్రిస్ గేల్ కొత్త ఏడాది సందర్భంగా తమ ప్రాంత విశిష్టతను ప్రపంచానికి చాటాడు. డ్రాగన్ వేషధారణతో హుషారుగా డాన్స్ చేస్తూ మురిసిపోయాడీ యూనివర్సల్ బాస్. ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఫ్రుక్రి గ్వాన్ 2026' పేరుతో షేర్ చేసిన వీడియోలో కరీబియన్ మూలాలతో గిల్ కనిపించాడు. ఈ పదానికి 'ఏం జరుగుతోంది?' అని అర్థం. పక్షి రెక్కలను పోలిన డ్రాగన్ బొమ్మలను ధరించిన గిల్.. చేతిలో పొడవాటి కర్రతో చిందులు వేశాడు. మైదానంలో తన డేరింగ్ ఆటకు కేరాఫ్ అయిన ఈ మాజీ ఓపెనర్.. ఇప్పుడు సంప్రదాయ లుక్‌లో దర్శనమిచ్చి ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించాడు.

**వరల్డ్‌కప్ హీరో..**

జమైకాకు చెందిన గేల్ 1999లో క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. విధ్వంసక ఇన్నింగ్స్‌లతో అనతికాలంలోనే డేంజరస్ బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు. టెస్టులు, వన్డేలు, టీ20లు.. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారించాడు.

ధర్మఘంట

# సంక్రాంతి బరిలో మాస్ మహారాజా.. హుషారెత్తిస్తున్న 'వామ్మో.. వాయ్యో..' సాంగ్




మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. క్లాస్ చిత్రాల దర్శకుడు కిషోర్ తిరుమల దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మేకర్స్ తాజాగా ఈ సినిమాలోని 'వామ్మో.. వాయ్యో..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియా తనదైన మాస్ బీట్స్‌తో స్వరపరిచిన ఈ పాటకు దేవ్ పవార్ సాహిత్యం అందించగా, స్వాతిరెడ్డి తన గాత్రంతో పాటకు మరింత హుషారుని తీసుకువచ్చారు. రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతీ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం కిషోర్ తిరుమల మార్కు ఎమోషన్స్‌తో పాటు, రవితేజ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా సాగే పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది.



# 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ డేట్ ఫిక్స్..

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా ట్రైలర్‌ను జనవరి 4న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12, 2026న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# ఆది సాయికుమార్‌కు పెద్ద హిట్.. వారం రోజుల్లోనే..

హిట్టు కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్నాడు హీరో ఆది సాయికుమార్. తన కంటే ఎక్కువగా అతడి తండ్రి, నటుడు సాయికుమార్ నిరీక్షిస్తున్నాడు. వీరి ఎదురుచూపులకు తెరదించుతూ 2025 ముగింపులో భారీ విజయం సొంతమైంది. శంబాల సినిమాతో ఆది హిట్టు కొట్టాడు. తండ్రి సినీ జర్నీ మొదలై 50 ఏళ్లు పూర్తయిన సమయంలో ఈ సక్సెస్ రావడం మరింత విశేషం!

**వారం రోజుల్లోనే అన్ని కోట్లా?**

శంబాల విషయానికి వస్తే ఆది హీరోగా, అర్చన్ అయ్యర్ హీరోయిన్‌గా నటించారు. యుగంధర్ ముని దర్శకత్వం వహించగా మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించారు. ఈ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందించాడు. ఈ మూవీ క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కేవలం వారం రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.16.20 కోట్లు రాబట్టింది. ఇప్పటికీ థియేటర్లలో విజయవంతంగా ఆడుతోంది. శంబాల సక్సెస్‌తో ఆదికి మంచి బూస్ట్ దొరికినట్లయింది!




# దళపతి క్రేజ్.. అడ్వాన్స్ బుకింగ్స్‌లో 'జన నాయగన్' రికార్డులు




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తన సినీ ప్రస్థానానికి వీడ్కోలు పలుకుతూ నటిస్తున్న చివరి చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సంక్రాంతి కానుకగా జనవరి 9, 2026న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. అయితే సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఓవర్సీస్ మార్కెట్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ సునామీ సృష్టిస్తున్నాయి. కేవలం విదేశీ బుకింగ్స్ ద్వారానే ఈ చిత్రం ఇప్పటివరకు రూ.15 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఇది విజయ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్‌గా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొంతకాలంగా ఈ సినిమా నందమూరి బాలకృష్ణ సూపర్ హిట్ చిత్రం 'భగవంత్ కేసరి'కి రీమేక్ అనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ విషయంపై స్పందించిన దర్శకుడు హెచ్.వినోద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను ఈ వార్తలను ధ్రువీకరించను.. అలాగని కొట్టిపారేయను. ఇది కేవలం ఒక రీమేకా లేదా ఏదైనా చిత్రం నుంచి స్ఫూర్తి పొందిందా అనేది పక్కన పెట్టండి. ఇది పక్కా 'దళపతి' మూవీ. ప్రేక్షకులు ఆందోళన చెందకుండా థియేటర్లకు వచ్చి సినిమాను ఆస్వాదించండి" అని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా చుట్టూ ఉన్న సస్పెన్స్‌కు తెరదించుతూ చిత్ర బృందం రేపు (జనవరి 3) అధికారిక ట్రైలర్‌ను విడుదల చేయబోతోంది. ఈ ట్రైలర్ ద్వారా కథపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.



# గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ప్రేమకథ.. టీజర్ రిలీజ్

ఆల్బమ్ సాంగ్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్.. 'మేమ్ ఫేమస్' సినిమాతో హీరో, దర్శకుడిగా హిట్ అందుకున్నాడు. దాదాపు రెండేళ్ల తర్వాత ఇప్పుడు 'గోదారి గట్టుపైన' అనే మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. రిలీజ్ ఎప్పుడనేది ఇప్పుడు వెల్లడించలేదు కానీ తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. గోదావరి బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన ఓ క్యూట్ ప్రేమకథ ఇదని తెలుస్తోంది. దీనికి తోడు ఫ్రెండ్స్ గ్యాంగ్‌తో చేసే కామెడీ ఉండనే ఉందని టీజర్‌తో క్లారిటీ ఇచ్చారు. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ హీరోహీరోయిన్లు కాగా సుదర్శన్, రాజ్ కసిరెడ్డి లాంటి కమెడియన్స్ ఉన్నారు. బహుశా వేసవిలో థియేటర్లలో రిలీజ్ చేస్తారేమో? అప్పట్లో షార్ట్ ఫిల్మ్ తీసి పేరు తెచ్చుకున్న సుభాష్ చంద్ర.. ఈ చిత్రంతో సినిమా దర్శకుడిగా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు.

# టాలీవుడ్ సైకలాజికల్ థ్రిల్లర్.. రిలీజ్ ఎప్పుడంటే?




వెంకటేశ్ పట్నాలా స్వీయ దర్శకత్వంలో వస్తోన్న చిత్రం ఆల్ఫా రిడంప్షన్. తానే హీరోగా నటిస్తూ పట్నాలా ఫిల్మ్ బ్యానర్‌లో ఈ మూవీని నిర్మించారు. విభిన్న కథా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. యాక్షన్ అండ్ ఎమోషనల్ డ్రామాగా వస్తోన్న ఈ సినిమా అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని జనవరి 3న థియేటర్లలో విడుదల కానుంది.

ఈ చిత్రాన్ని సైకలాజికల్ యాక్షన్ డ్రామాగా రూపొందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ మూవీ కథేంటో అర్థమవుతోంది. రెగ్యులర్ యాక్షన్ సినిమాలకు భిన్నంగా తెరకెక్కించారు. మనిషిలోని భావోద్వేగాలను, ప్రాయశ్చిత్తాన్ని చూపే సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమాకు భువన్, మార్టిన్ సంగీతమందించారు.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# మార్చిలో 'ఆపరేషన్ సిందూర్ 2.0'!




'ఆపరేషన్ సిందూర్ 2.0' మార్చినెలలోనే మొదలు కానుందా? కశ్మీరంలో మంచు కరిగి.. ఎండాకాలం మొదలవ్వగానే సైన్యం రంగంలోకి దిగి, ఉగ్రవాదుల పీచమణచనుందా?? ఈ దెబ్బతో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదులకు దబిడిదిబిడేనా?? ఈ ప్రశ్నలకు భారత వర్గాల నుంచి ఎలాంటి సమాచారం లేకున్నా.. పీవోకేలో లాంచ్ ప్యాడ్లను ఏర్పాటు చేసుకుని, భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న లష్కరే తాయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థలు మాత్రం అవుననే సమాధానం ఇస్తున్నాయి. అటు పీవోకేతోపాటు.. ఇటు జమ్మూకశ్మీర్‌లో పాగావేసుకున్న ఉగ్రవాదులు సైతం ఈ సమాచారంతో బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల అనంతరం ఉగ్రవాద సంస్థలు ఈ మేరకు సమాచారాన్ని అందిపుచ్చుకున్నాయి. రెండు పేజీల సందేశాన్ని ఉగ్రవాద సంస్థలు పరస్పరం అందిపుచ్చుకుంటున్నాయని, అందులో పాకిస్థాన్ నిఘా సంస్థ హెచ్చరికలను ఉటంకిస్తున్నాయని అత్యంత విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి.

ఈ పత్రిక ద్వారా ఉగ్రవాదులకు సైన్యం ఆపరేషన్, తదుపరి సన్నాహాల గురించి తెలియజేస్తున్నారు. 33 ఏళ్లుగా పరారీలో ఉన్న జహంగీర్ అనే ఉగ్రవాదితో ఇంటర్వ్యూ కూడా ఇందులో ఉంది.

చొరబాట్ల ప్రణాళిక సిద్ధం, రాశారు– పరిస్థితికి సమాధానం ఇవ్వకపోతే పరిస్థితి మరింత దిగజారుతుంది ఉగ్రవాద సంస్థలు సందేశం ఇవ్వడానికి ఖఎ పేరుతో లేఖ పంపుతున్నాయి. ఖఎ అంటే – నా ఆత్మ యొక్క ఉనికి ద్వారా నా జీవితం ఉంది. నెల రోజుల వ్యవధిలోనే ఈ నెట్ వర్క్ తరపున పలుమార్లు ప్రకటనలు చేసి ఉగ్రవాద గ్రూపులకు పంపారు. ఈ ప్రకటనలలో ఒకటి 9 పేజీలు. దాని చివరి పేజీలో, భారత సైన్యం యొక్క సన్నద్ధత గురించి ప్రస్తావన ఉంది. నవంబర్ 10న జరిగిన ఢిల్లీ పేలుళ్లను ప్రస్తావిస్తూ హెచ్చరికలు జారీ చేశారు. అయితే.. ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఉన్న ఈ లేఖలు డిసెంబరు చివరి వారంలో విడుదలైనట్లు తెలుస్తోంది.


**ఢిల్లీ పేలుళ్ల తర్వాత..**

ఇటీవలి ఢిల్లీ పేలుళ్ల తర్వాత భారత బలగాలు అప్రమత్తమైనట్లు ఉగ్రవాద మూకలు గుర్తించాయి. దీంతో.. శీతాకాలం ముగిసేలోపే కశ్మీర్‌లో పాగా వేయాలని నిర్ణయించాయి. ఒకవేళ ఈ టాస్క్ తప్పితే.. మార్చిలో భారత సైన్యం ప్రారంభించే 'ఆపరేషన్ సిందూర్ 2.0'తో ఇబ్బందులు తప్పవని ఆ లేఖలో హెచ్చరించాయి. ఈలోగానే తమతమ ఉగ్రవాద సంస్థల్లో జోరుగా రిక్రూట్‌మెంట్లు నిర్వహించాలని ఆ లేఖలో తీర్మానించాయి. "సైన్యం కార్యకలాపాలపై స్థానికులతో నిఘా పెంచాలి. సంస్థలతో సంబంధం లేకుండా.. భారత సైన్యం ప్రణాళికలను అడ్డుకోవాలి. ఢిల్లీ పేలుళ్లు, నౌగామ్‌లో పేలుడుతో పోలీసులు, భారత సైన్యం కసితో ఉన్నాయి. రాటిల్ పవర్ ప్రాజెక్టుపై దృష్టిపెట్టాయి" అని ఆ లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. కాగా.. రాటిల్ పవర్ ప్రాజెక్టు వద్ద పోలీసులు అరెస్టు చేసిన మహమ్మద్ అమీస్ అలియాస్ జహంగీర్ సరూరి 1992 నుంచి హిజ్బుల్ ముజాహిదీన్ కోసం క్రియాశీలంగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇతను పలు హత్య కేసుల్లో నిందితుడు. గతంలో 'ద రివల్యూషన్ రీసర్జెన్స్' అనే మ్యాగజైన్‌లో అతని ఇంటర్వ్యూ ప్రచురితమైనట్లు భారత భద్రతాబలగాలు గుర్తించాయి. ఆ ఇంటర్వ్యూలో జహంగీర్ తాను త్యాగం వైపు అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నాడు.

# ఏ ఉద్యమ ఉప్పెన నుంచి నెత్తుటి నిశ్శబ్దానికి!

చర్ల





సుమారు 16 రాష్ట్రాల్లో సమాంతర ప్రభుత్వం నడిపిన మావోయిస్టు పార్టీకి అంతిమ ఘడియలు సమీపించినట్టేనా? ఉద్యమంతో ఉప్పెనలా నింగికి ఎగిసిన మావోయిస్టు పార్టీ ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో నెత్తుటి నిశ్శబ్దానికి చేరినట్టేనా? దశాబ్దాలుగా మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న దండకారణ్యంలో ఇక ఉద్యమ నినాదాలు ఆగిపోయినట్టేనా?.. ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలన్నీ ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను అంతం చేయడం లక్ష్యంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ దాదాపుగా చివరి దశకు చేరింది. మావోయిస్టు అగ్రనేతల్లో చాలా మంది మరణించడమో, లొంగిపోవడమో జరిగింది. దిగువస్థాయి కేడర్‌లోనూ లొంగుబాట్లు పెరిగాయి. ప్రస్తుతం పార్టీ చీఫ్ దేవ్‌జీతోపాటు గణపతి, మిషిర్ బెస్రా కేంద్ర కమిటీ సభ్యులుగా మావోయిస్టు పార్టీని నడిపిస్తున్నారు. వారికి తోడుగా తెలంగాణ కార్యదర్శి దామోదర్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పాపారావు ఉన్నారు. ఈ ఐదుగురు లొంగిపోయినా, అరెస్టయినా, ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినా మావోయిస్టు పార్టీ కథ ముగిసినట్టేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రం ఆపరేషన్ కగార్ ముగింపునకు పెట్టుకున్న లక్ష్యం మరో 90 రోజులే ఉన్న నేపథ్యంలో గత రెండేళ్లలో జరిగిన పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

**దశాబ్దాల పట్టును దెబ్బతీసే ప్రణాళికతో..**

దేశంలో సుమారు 16 రాష్ట్రాల్లో దశాబ్దాల పాటు మావోయిస్టుల ప్రభావం కొనసాగింది. ముఖ్యంగా ఛత్తీసగఢ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో మావోయిస్టులు పట్టుకొనసాగించారు. అడవుల్లోకి వెళ్లాలంటే వణికి పోయే పరిస్థితి ఉండేది. మావోయిస్టులకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు కలిసి ఆపరేషన్ గ్రీన్‌హంట్, ఆపరేషన్ ప్రహార్ వంటివి చేపట్టినా పెద్దగా ప్రభావం కనిపించలేదు. 2021లో తెర్రం అడవుల్లో హిడ్మా ఆధ్వర్యంలో మావోయిస్టులు చేసిన దాడిలో 21 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చనిపోయారు. మరొకరిని కిడ్నాప్ చేసిన మావోయిస్టులు ప్రజలు, విలేకరుల సమక్షంలో విడిచిపెట్టారు. ఆ ఘటనతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. సుమారు రెండేళ్లపాటు పక్కాగా ప్రణాళిక రూపొందించి 'ఆపరేషన్ కగార్' ప్రారంభించింది. బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో ప్రతి 5 నుంచి 10 కిలోమీటర్లకు ఒక సీఆర్‌పీఎఫ్ క్యాంపును ఏర్పాటు చేశారు. అనధికారిక లెక్కల ప్రకారం 500కుపైగానే క్యాంపులు పెట్టి.. కమాండోలనూ మోహరించింది.

**ఆ రెండు వంతెనలే కీలకం..**

ఆపరేషన్ కగార్‌లో రెండు భారీ వంతెనల నిర్మాణం కీలకంగా నిలిచింది. నేషనల్ పార్కులో కట్టిన వంతెన ఒకటి, పామేడు అడవుల్లో చింతవాగుపై వంతెన రెండోది. వీటి ద్వారా భద్రతా బలగాల రాకపోకలు, క్యాంపుల ఏర్పాటు సులువు అయ్యాయి. మరోవైపు బస్తర్‌లోని ఏడు జిల్లాల్లో మావోయిస్టుల నుంచి ఆదివాసీలను దూరం చేసేందుకు అభివృద్ధి మంత్రాన్ని జపించింది. రోడ్లు, విద్య, వైద్యం, రేషన్, మొబైల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మెల్లగా గ్రామాల వారికి దగ్గరై.. మావోయిస్టులతో సంబంధాలున్న వారిని, ఇన్ఫార్మర్లను గుర్తించి అరెస్టు చేసింది. విస్తృతంగా కూంబింగ్‌లు చేపడుతూ మావోయిస్టులను వెంటాడింది.

**ముఖ్య నాయకత్వమంతా అంతం!**

ఆపరేషన్ కగార్, ఇతర కారణాలతో మావోయిస్టు పార్టీ అగ్రనాయకత్వం చాలా వరకు తుడిచిపెట్టుకుపోయింది. పార్టీ జనరల్ సెక్రెటరీ బసవరాజు, కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, వివేక్, గౌతమ్, గాజర్ల రవి, భాస్కర్, ప్రయాంగ్, కట్టా రామచంద్రారెడ్డి, కదిరి సత్యనారాయణరెడ్డి, హిడ్మా, ఉయికా గణేశ్ మృతిచెందారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు సుధాకర్, జగదీశ్, రేణుక, మధు, భాస్కర్‌రావు, రణధీర్, నిర్మల, రూపేశ్, జోగన్న, దస్రు కూడా మరణించారు.

**మిగిలిన అగ్రనేతలు వీరే..**

మావోయిస్టు పార్టీ ఏర్పడినప్పుడు 41 మంది కేంద్ర కమిటీ సభ్యులున్నారు. ఆపరేషన్ కగార్‌లో 11 మంది మృతి చెందారు. మరికొందరు లొంగిపోయారు. ప్రస్తుతం ముగ్గురే మిగిలారు. తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి ఇద్దరూ తెలంగాణ వారే. మరొకరు జార్ఖండ్‌కు చెందిన మిషిర్ బెస్రా అలియాస్ భాస్కర్. ఇక మావోయిస్టు పార్టీ తెలంగాణ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పాపారావు కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు.

**మావోయిస్టులకు చివరి ఊపిరి: బస్తర్ ఐజీ**

మార్చి 31నాటికి బస్తర్ అడవులు మావోయిస్టు రహితంగా మారుతాయని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు. అడవుల్లో 2025లో 52కు పైగా క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. మావోయిస్టు పార్టీ చివరి ఊపిరి తీసుకుంటోందన్నారు. లొంగిపోయినవారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు.

# వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు



వర్క్ – లైఫ్ బ్యాలెన్స్ అనే అంశం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగ ఒత్తిడి, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్న ప్రశ్నపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తాజాగా వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలపైనే మాట్లాడే జైశంకర్ ఈసారి తన వ్యక్తిగత జీవన విధానం గురించి ఓపెన్‌గా చెప్పడం విశేషంగా మారింది. ఐఐటీ మద్రాస్ విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన జైశంకర్... తనకు మిగతా ఉద్యోగుల్లా వారాంతపు సెలవులు ఉండవని స్పష్టం చేశారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు షెడ్యూల్ వేసుకుని పనిచేయడం తన వృత్తిలో సాధ్యం కాదన్నారు. అంతర్జాతీయ వ్యవహారాలకు టైమ్ టేబుల్ ఉండదని, ప్రపంచంలోని దేశాలు వేర్వేరు టైమ్ జోన్లలో ఉండటంతో ఎప్పుడైనా పని చేయాల్సి వస్తుందని వివరించారు. తన రోజువారీ జీవితంలో కొన్ని అలవాట్లను పాటిస్తూ మానసిక ప్రశాంతతను పొందుతున్నానన్నారు. విశ్రాంతి కోసం సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, సినిమాలు చూడడం, క్రీడల్లో జరుగుతున్న విషయాలను తెలుసుకోవడం వంటి అలవాట్లు తనకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ అలవాట్ల వల్ల ప్రపంచంతో అనుసంధానమై ఉండగలుగుతున్నానని, అదే తనకు వర్క్ – లైఫ్ బ్యాలెన్స్‌ను ఇస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా బ్రేక్ తీసుకోవడం లేదా డిటాక్స్ కావాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్న జైశంకర్... ఈ విధానంతో తన జీవితం సహజంగానే కొనసాగుతోందన్నారు. అయితే ఈ అభిప్రాయాలు ఇంట్లో అందరికీ నచ్చవని నవ్వుతూ చెప్పారు. తన భార్య కూడా ఇక్కడే ఉన్నారని, ఈ విషయంపై ఆమె తనతో విభేదించే అవకాశం ఉందని సరదాగా వ్యాఖ్యానించారు. జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు సోషల్ మీడియాలోనూ చర్చకు దారి తీశాయి.

## త్వరలో బెంగాల్‌కు ప్రధాని మోదీ

పశ్చిమ బెంగాల్‌లో రాజకీయం వేడెక్కనుంది. ఈ ఏడాదిలో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే అధికార, ప్రతిపక్షాలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ నెల 17న బెంగాల్‌లో పర్యటించనున్నట్లు బీజేపీ ప్రకటించింది. అక్కడ మోదీ బహిరంగ సభలో పాల్గొనడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీజేపీ హవా నడుస్తోంది. గతేడాది జరిగిన ప్రతి ఎన్నికల్లో  కాషాయపార్టీ నేరుగానో లేక కూటమి ద్వారానో అధికారం సాధించింది. అయితే పశ్చిమ బెంగాల్లో మాత్రం అధికారం కాషాయానికి ఇప్పటికీ అందని ద్రాక్షగానే ఉంది. గత ఎన్నికల్లో అధికారం సాధిస్తామని చెప్పుకున్నప్పటికీ ఆపార్టీ డబుల్ డిజిట్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. దీంతో ఈ ఏడాది జరిగే ఎలక్షన్లో ఎలాగైనా గెలవాలని బీజేపీ భావిస్తోండగా మరోసారి గెలిచి కాషాయ పార్టీకి ఝలక్ ఇవ్వాలని తృణముల్ కాంగ్రెస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ నెల పశ్చిమ బెంగాల్‌లోని మాల్గాలో బహిరంగ ర్యాలీలో మోదీ పాల్గొననుట్లు బీజేపీ ప్రకటించింది. జనవరి 17న మాల్దాలో 18న హౌరాలో ర్యాలీలలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపింది. ఈ కార్యక్రమంలో మోదీ హౌరా– గుహావతి వందే భారత్ స్లీపర్ రైలును ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. దానితో పాటు మరి కొన్ని కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం.  ఈ ఏడాది పశ్చిమ బెంగాల్‌తో పాటు తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరి, కేరళ అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో దేశంలో పొలిటికల్ హీట్ పెరగనుంది.

## సంఘ విద్రోహ శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతోంది

ఉదయ్‌పుర్

సంఘ విద్రోహ, దేశ వ్యతిరేక శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్న ధోరణి ఆందోళన కలిగిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో వైట్ కాలర్ ఉగ్రవాదం అధికమవుతోందని తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో భూపాల్ నోబుల్స్ విశ్వవిద్యాలయం 104వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో శుక్రవారం రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. గతేడాది నవంబరు 10న దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడును ప్రస్తావిస్తూ వైట్ కాలర్ ఉగ్రవాదంపై ఆవేదన వ్యక్తం చేశారు. జ్ఞానంతో పాటు విలువలు, నైతికత ఎంత అవసరమో ఆ ఘటన తెలియజేస్తుందని చెప్పారు. రోగులకు ప్రిస్క్రిప్షన్ రాసే వైద్యుల చేతుల్లో ప్రమాదకర పేలుడు పదార్థాలు ఉండటం దురదృష్టకరమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలోని డిఫెన్స్ స్టార్టప్‌లు అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నాయని చెప్పారు. రాబోయే 15 ఏళ్లలో ఆయుధాల తయారీలో భారత్ పూర్తి స్వయం సమృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**ఆత్మాభిమానం అహంకారంగా మారకూడదు**

ఆత్మాభిమానం చాలా ముఖ్యమని దానిని ఎప్పుడూ అహంకారంగా మారనివ్వరాదని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. "ఆత్మాభిమానం, అహంకారం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. విద్యార్థులు తమ జీవితంలో అహంకారానికి చోటునివ్వకూడదు" అని హితవుపలికారు.

## నీరు కాదు విషాన్ని పంచారు



కలుషిత నీరు తాగి మధ్యప్రదేశ్ లోని ఇండౌర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు  అక్కడి ప్రభుత్వం నీరు కాకుండా.. విషాన్ని పంపిణీ చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోందని రాహుల్ విమర్శించారు. కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొందని.. పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు అధికార భాజపా నేతలు నిర్లక్ష్యపు ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలకు ఓదార్పు ఇవ్వకుండా.. అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 'మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటి గురించి గతంలో ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? తాగే నీటిలో మురుగునీరు ఎలా కలిసింది? వెంటనే నీటి సరఫరా ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?' అని రాహుల్ ప్రశ్నించారు. పరిశుభ్రమైన నీరు పొందడం  ప్రజల హక్కు అని అన్నారు. ఈ హక్కును కాలరాసిన భాజపా ప్రభుత్వమే దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు.

మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీనే కారణం: ఇండౌర్ ఘటనలో కీలక విషయం

దుష్పరిపాలనకు మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని విమర్శించారు. మొన్నటి వరకు దగ్గు మందు కారణంగా, ఆ తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు కలుషిత నీరు కారణంగా మృతి చెందుతున్నారన్నారు. ఇలా ఎప్పుడు పేదలు మరణించినా.. మోదీజీ మాత్రం మౌనంగానే ఉంటారని విమర్శిం చారు. ఇక, ఓ మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీ వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని నగర మున్సిపల్ కార్పొరే షన్ అధికారులు తాజాగా తెలిపారు. ఈ కలుషిత నీరు తాగి ఇప్పటివరకు 10 మంది మృతి చెందారని ఇండౌర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ వెల్లడించారు.

## 'ఇక సమయం వచ్చింది'

పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ బలూచ్ మానవ హక్కుల నేత మీర్ యార్ బలూచ్, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు ఒక బహిరంగ లేఖ రాశారు. చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్  తుది దశకు చేరుకోవడంతో, రాబోయే కొద్ది నెలల్లో బలూచిస్థాన్‌లో చైనా తన సైన్యాన్ని మోహరించే ప్రమాదం ఉందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనా–పాకిస్థాన్ కూటమి భారత్, బలూచిస్థాన్ రెండింటికీ పెను ప్రమాదమని పేర్కొంటూ, ఈ సమస్యను సమూలంగా పెకిలించి వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'శ' ద్వారా మీర్ యార్ ఈ లేఖను విడుదల చేశారు. "బలూచిస్థాన్ గడ్డపై చైనా సైనికులు అడుగుపెడితే, అది భారత్, బలూచిస్థాన్ భవిష్యత్తుకు ఊహించని ముప్పును కలిగిస్తుంది" అని ఆయన హెచ్చరించారు. గత 79 ఏళ్లుగా పాకిస్థాన్ ఆక్రమణ, ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం, దారుణమైన మానవ హక్కుల ఉల్లంఘనలతో బలూచ్ ప్రజలు నలిగిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ దేశానికి శాశ్వత శాంతి, సార్వభౌమత్వం లభించేందుకు ఈ సమస్యను మూలాలతో పెకిలించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గతేడాది (2025) పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మోదీ ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' ద్వారా తీసుకున్న సాహసోపేతమైన చర్యలను ఆయన ప్రశంసించారు. ఇది ప్రాంతీయ భద్రత పట్ల భారత నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. బలూచిస్థాన్‌లోని హింగ్లాజ్ మాత ఆలయం వంటి చారిత్రక ప్రదేశాలను ప్రస్తావిస్తూ, భారత్–బలూచిస్థాన్ మధ్య ఉన్న పురాతన బంధాన్ని గుర్తుచేశారు. ఆరు కోట్ల బలూచ్ ప్రజల తరపున శాంతి, వాణిజ్యం, రక్షణ, భద్రత వంటి రంగాల్లో భారత్‌తో భాగస్వామ్యం కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే, మీర్ యార్ బలూచ్ రాసిన ఈ లేఖపై ఇప్పటివరకు భారత్, పాకిస్థాన్, లేదా చైనా ప్రభుత్వాల నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. పాక్ ఆక్రమిత కశ్మీర్ గుండా వెళ్తున్నందున, సీపీఈసీ ప్రాజెక్టును భారత్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.

## రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

- డి బి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్




ధర్మఘంట, జనవరి 02, సూర్యాపేట:

జనవరి 8, 9 న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డి బి ఎస్ యు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో జిల్లా అధ్యక్షులు బచ్చలకూరి జానయ్య అధ్యక్షతన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.రాష్ట్రంలో అంబేద్కర్ అభయహస్తం క్రింద ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం,ప్రతి నిరుపేద కుటుంబానికి మూడెకరాల భూపంపిణీ, ప్రభుత్వ, పోరంబోకు భూములు సాగుచేస్తున్న ప్రతి దళిత కుటుంబానికి భూమి యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని 250 రోజుల పనిదినాలు పెంచి, కనీస వేతన చట్టాన్ని అమలుచేసి, రాష్ట్రంలో దళితులపై రోజురోజుకు పెరిగిపోతున్న దాడులు అరికట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పంతం నరసయ్య, నియోజకవర్గ బాధ్యులు వగ్గు వెంకన్న, జిల్లా నాయకులు ఆకారపు శ్రీనివాస్, నెమ్మాది మల్సూర్, ఎర్ర సుమన్, దప్పు మంగయ్య, వలపట్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేటలో సరికొత్త ట్రెండ్ తో పిల్లలను పెద్దలను ఆకర్షించేది ఎగ్జిబిషన్



ధర్మఘంట, జనవరి 02, సూర్యాపేట

చిన్నపిల్లల దగ్గర నుండి ముసలి వాళ్ళ వరకు అందరిని ఆకర్షించేది ఒక ఎగ్జిబిషన్ మాత్రమే అని డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 36వ వార్డు గోపాలపురంలో సంబ్రదీ ట్రేడ్ పెయిర్ ఎగ్జిబిషన్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాణిజ్య, వ్యాపారాలకు వ్యాపార కేంద్రంగా సూర్యాపేట ఉంది అని అన్నారు. పిల్లలకు పెద్దలకు సెలవు వచ్చిందంటే ఎక్కడికన్నా వెళ్లాలి అని అనుకుంటారని కానీ మన సూర్యాపేటలో ఇంత పెద్ద ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. పిల్లలను పెద్దలను ఆకట్టుకునే విధంగా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని అన్నారు. ఎగ్జిబిషన్ కు కావలసిన పర్మిషన్లు అన్ని తప్పకుండా తీసుకోవాలని తెలియజేశారు. మీరు విజయం సాధించాలని మనసారా ప్రార్థిస్తున్నానని అన్నారు. నా సహాయ సహకారాలు మీకు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ నాయకులు ఫారుక్ వచ్చిన ముఖ్య అతిథులను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కర్ణాకర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, కుమ్మరి కుంట్ల వేణు, చెంచాల శ్రీనివాస్, రావుల రాంబాబు, నిఖిల్ నాయుడు, మాద నవీన్ గౌడ్, కల్లూరి మురళీకృష్ణ, కుంభం రాజేందర్, మద్దె బోయిన శ్రీనివాస్, ఎగ్జిబిషన్ నిర్వాహకులు తుమ్మ అప్పిరెడ్డి, అమర్లపూడి భారసారి, అమర్లపూడి ప్రకాష్, ఉమామహేశ్వర్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీకి మరో తలనొప్పి

ఏలూరు

వైఎస్ఆర్‌సీపీకి దేవుడే దిక్కయ్యాడు. అది కూడా హిందూ దేవుళ్లే దిక్కయ్యారు. ఎందుకంటే రాజకీయాలు చేయడానికి. ఎక్కడ ఏ చిన్న అంశం జరిగినా పెద్దవివాదం చేసేందుకు వచ్చేస్తున్నారు. ఆ వివాదంతో హిందువుల్ని తమ వైపు తిప్పుకోవాలని అనుకుంటున్నారేమో కానీ.. వారు దేవుడితో చేస్తున్న రాజకీయమే హైలెట్ అవుతోంది. ఓ క్రిస్టియన్ నేతృత్వంలో ఉన్న పార్టీ హిందువుల్ని.. హిందూ దేవుళ్లను చులకన చేయాలని చూస్తోందన్న ఆరోపణలకు కారణం అవుతోంది. కానీ వైసీపీ నేతలు మాత్రం ఈ విషయాన్ని గుర్తించలేక తమ గుడ్డెద్దు చేలో పడిన తరహా రాజకీయాలు తాము చేసుకుటూ పోతున్నారు.మనుషుల్లో రకరకాల మనస్థత్వాలు ఉన్న వారు ఉంటారు. కోపంతో..కసితో..కక్షతో తాము ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో నేరాలు చేసేవారు ఉంటారు. అలాంటి వాడొకడు..ద్రాక్షామంలో శివలింగాన్ని ధ్వంసం చేశాడు. ఓ పూజారిపై కోపంతో .. ఆ శివలింగాన్నిఆ పూజారి రోజూ పూజలు చేస్తాడన్న కారణంతో ఆ శివలింగాన్ని ధ్వంసం చేశాడు. అతను కూడా శివభక్తుడే .కానీ ద్వేషంతో అతని కళ్లు మూసుకుపోయి ఘోరం చేశాడు. దానికి అతను శిక్ష అనుభవిస్తాడు. కానీ ఈ ఘటనతో రాజకీయం చేయాలనుకున్న వైసీపీ .. అంత కంటే పెద్ద తప్పిదం చేసింది. దేవుడికి జరగాల్సిన కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీన్ని రాజకీయం చేయాలనుకుంది.హిందూ దేవుళ్ల విషయంలో వైసీపీ ఎలాంటి జోక్యం చేసుకున్నా అది ఆ పార్టీకి పెను సమస్యగా మారుతుంది. ఆపార్టీ బ్యాక్ గ్రౌండ్ అలాంటిది. ఆ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో టీటీడీని ఎంత భ్రష్టుపట్టించారో మరో ఇరవై ఏళ్ల వరకూ హిందువులు మర్చిపోయారు. ఉద్ధృతంగా సాగిన మత మార్పిళ్లకు జగన్ ప్రభుత్వం ఎలా సహకరించిందో కూడా మర్చిపోరు. వైసీపీ నేతల్లో చాలా మంది హిందువులు ఉంటారు. దేవుడిపై అమితమైన భక్తిని చూపిస్తూ ఉంటారు. కానీ వారే దేవుడిని దోపిడీ చేశారు. హిందూత్వాన్ని కించపరిచారు. ఇలాంటివన్నీ ప్రజల ముందు ఉన్నాయి. వైసీపీ నేతలు ఇప్పుడు తాము హిందూత్వాన్ని కాపాడుతామని

# స్త్రీ దరహాసం దోచిన ఇతిహాసం

## (జనవరి 3 సావిత్రి బాయి పూలే 195వ జయంతి సందర్భంగా)

ధర్మఘంట

రాహుల్ సాంకృత్యాయన్ రాసిన 'ఓల్గా సే గంగా' (కథలు) 'విస్మృత యాత్రికుడు' (నవల) డి.డి. కోశాంబి రాసిన 'భారత చరిత్ర' పరిచయ వ్యాసాలు గార్డెన్ చైల్డ్ రాసిన 'చరిత్రలో ఏం జరిగింది?' వంటి పుస్తకాల్ని స్త్రీ దృక్కోణంలోంచి పరిశీలించినపుడు మానవ సమాజంలో వివిధ దశల్లో స్త్రీకి ఉంటూ వచ్చిన స్థానాన్ని కొంతవరకు బేరీజు వేసుకోవచ్చు. తరతరాలుగా "ఆమె" పరిస్థితి ఏ మాత్రం మెరుగుకాలేదని ఆధారాలతో నిరూపించొచ్చు. రాహుల్ జీ సంస్కృత పండితుడు. లెనిన్ గ్రాడ్ విశ్వవిద్యాలయంలో బోధన చేశాడు. స్వాతంత్ర్య యోధుడిగా జైలు జీవితం గడిపాడు. ఆయన సంపాదించుకున్న అపారమైన అనుభవం, విజ్ఞానం భారతీయ సంస్కృతిపై అనేక పుస్తకాలు రాయడానికి దోహదం చేసింది. అలాగే మన చరిత్రకారులలో ఆధునిక దృక్పథంగల వారందరూ డి.డి. కోశాంబిని ఆద్యునిగా భావిస్తారు.

చారిత్రక పూర్వదశను గురించి రాసిన చరిత్రకారుల్లో గార్డెన్ చైల్డ్ హిమాలయం వంటి వాడని ఒక అభిప్రాయం ఉంది. ఇటు సాహిత్యం అటు చరిత్ర, సామాజిక శాస్త్రాలలో నిష్ణాతుల యిన వీరి రచనల్లో ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలు చాలాలోతుగా నిర్మించబడ్డాయి. కలగా పులగంగా ఉన్న ఎన్నో అంశాల్ని ఒక దృష్టికోణంతో పరిశీలించినట్లయితే స్త్రీ దరహాసం దోచిన ఇతిహాసం మనకు సాక్షాత్కరిస్తుంది!

మాతృస్వామ్యంలో అధికారం అంతా తల్లిదే. ఆమె ఆజ్ఞ లేనిదే సమూహంలో ఏదీ అయేది కాదు. వేటాడడం, తోలు అచ్ఛాదనలు తయారు చేయడం, ప్రేమించడం అన్నీ ఆమె పర్యవేక్షణలోనే అయ్యేవి. అప్పుడు ఒకటి మాత్రం కష్టంగా ఉండేది. నాయకురాలి సంతానానికి తండ్రెవరో తెలిసేది కాదు. ఇది సాధారణ శకానికి ముందు (బిసి) ఆరువేల నాటి పరిస్థితి. మూడువేల బిసి.ఇ. నాటికి కూడా పరిస్థితి మారలేదు. అడిగిన వారికి ఏ స్త్రీ అయినా తలుపు తెరవకుండా ఉండేది కాదు. నగంగా నిలబడితేనే, మద్యం అగ్నికి ఆహుతి చేసేప్పుడు, వాయిద్యాలు మోగిస్తూ అడవిలోకి వెళ్లేప్పుడూ నాయకురాలే ముందుండేది. అడవిలో స్వేచ్ఛగా విహరించే లేళ్లలా, పక్షుల్లా స్త్రీ కూడా స్వేచ్ఛగా స్వతంత్రంగా బతికేది.

సాధారణ శకం 2500 బిసి నాటికి పరిస్థితి కొంత మారింది. మట్టితో, రాళ్లతో, గోడలు లేచాయి. పశువుల్ని మచ్చిక చేసుకుని, వ్యవసాయం చేయడం మొదలైంది. సమూహాలు స్వేచ్ఛగా తిరగడం మాని, గ్రామాలుగా ఏర్పడడం మొదలయింది.తమ కోసం అని కాకుండా, తమ తరువాత తరాల కోసమని ఆహారం, ఆస్తి, సంపద నిలువ చేయడం మొదల య్యింది. దాంతో నాగరికత గొప్ప మలుపు తిరిగింది. మట్టితో రాళ్లతో గోడలు రావడం, క్రమంగా స్త్రీ వాటి మాటున ఉండిపోవడం జరిగింది. భద్రత కోసం, సహజసిద్ధమైన కొన్ని అవసరాల కోసం పురుషుడి మీద ఆధార పడాల్సి వచ్చింది. సమూహాల మధ్య యుద్ధాలు జరగడం మొదలైనప్పటి నుండి పురుషుడు అధికారంలోకి వచ్చాడు. సేనకు అధిపతిగా ఉండడం మహాపితరుని కర్తవ్యం - అనే భావన స్థిరపడింది. అంతకు ముందు లేని అబద్ధం, మోసం, కుట్ర మొదలయినవన్నీ మనిషికి అలవడ్డాయి.

2000 బిసిఇ నాటికి పరిస్థితులు మరింతగా మారాయి. చెట్ల మీద పెరిగే ఒక రకపు ఉన్ని, గొర్రెల ఉన్ని ఉపయోగించడంతో పాటు, నూలు బట్టలు వాడుకలోకి వచ్చాయి. పురుషుడు బలవంతుడై స్త్రీలను రాణివాసంలో బంధించి ఉంచాడు. అంటే, స్త్రీ వ్యక్తిత్వాన్ని హరించి, సొంత వస్తువుగా చేసుకున్న క్రమాన్ని మనం ఇక్కడ గమనించాలి. 1500 బిసిఇ నుండి 490 వరకు ఇలాంటి విషయాలెన్నో మనకు కనిపిస్తాయి. బలవంతుడు బలహీనున్ని అణగదొక్కడం సాధారణ శకానికి ముందు నుండే కనిపిస్తోంది. ఒకన్ని దెబ్బతీసి, బానిసగా కట్టి పడేసినప్పుడే వాడిమీదా, వాడి కుటుంబ సభ్యులందరి మీదా బలవంతుడికి అధికారం లభించింది. స్త్రీ తన పురుషుడు పెట్టే బాధల్నే కాకుండా, తనవాడికి యజమానైన బలవంతుడు పెట్టే బాధల్ని కూడా భరించాల్సి వచ్చింది. బలవంతులు దాసజనంలో భార్యాభర్తల సంబంధాన్ని మన్నించలేదు. స్త్రీని భర్తతో విడదీసి అమ్మారు. పిల్లలతో విడదీసి అమ్మారు. డబ్బున్న వాడు ఇద్దర్నీ, నలుగుర్నీ, పది మందిని మాత్రమే కాదు, చివరకు వంద మందిని కూడా పెళ్లి చేసుకోగలిగాడు. పెళ్లి లేకుండా కూడా అనుభవించగలిగాడు. జల క్రీడల్లో వారిని దిగంబరంగా పాల్గొనమన్నాడు.

అందమైన యువతుల్ని పాలరాతి విగ్రహాలుగా నిలబెట్టుకుని తన జీవిత సౌధాన్ని అలంకరించుకున్నాడు. ఒకే ఒకసారి బలవంతుడు వీరుడు లేదా రాజు స్పృశించినందుకు శిక్షగా వందలాది స్త్రీలు సహగమనం పేరుతో అగ్నికి ఆహుతయ్యేవారు. సాధారణ శకం 630లో అక్షయ వటవృక్షం మీది నుంచి వితంతువులంతా యము నానదిలోకి దూకి ప్రాణం పోగొట్టుకోవాలని శాసనం ఉండేది. అది ప్రయాగలో అమలు జరుగుతూ ఉండేది. సతీసహగమనం పేరుతో వితంతువులని సజీవంగా దహనం చేయడాన్ని వారు పాపంగా భావించలేదు. మహా పుణ్యమనే భావించారు. రాహుల్ జీ సృజనాత్మక రచనలోని ఒక పాత్ర ఇలా అంటుంది. "హర్షుడి లాగా, మిగిలిన రాజర్షుల్లాగా లక్షమంది యువతులను అనుభవించడానికి పందెం కట్టగలిగేవాన్ని" అని! ఆ మాటలోని పూర్వాపరాలు ఆలోచించుకుంటే బౌద్ధమతం బాగా వ్యాప్తిలో ఉన్న సమయంలో కూడా స్త్రీకి ఎంత విలువనిచ్చారో తెలుస్తూ ఉంది. బ్రహ్మచర్యం అన్నారు గానీ, తరతమ భేదం లేకుండా స్త్రీలందరూ పొందుకు పనికొచ్చేవారు. భిక్షువులు, సన్యాసులు, ఉండే మఠాలన్నీ అసజమైన వ్యభిచార గృహాలయ్యాయి." అందుకే కాబోలు 430 బిసిఇ నుంచి యజమానులు దాసీ పుత్రుల్ని వదిలేసి, పుత్రికల్ని ప్రేమతో పెంచుతూ వచ్చారు. ఆ ప్రేమ వెనుక కారణాల్ని మనం చాలా సులభంగా అవగతం చేసుకోవచ్చు. జీవితమంతా నగంగా యువతులతో చేయగల వెకిలి చేష్టలన్నీ చేసిన తర్వాత రాజులు రాజర్షులయారు. భోగులు యోగులయ్యారు. రాణీవాసంలోని యువతులందరినీ బ్రాహ్మణులకు దానం చేసి "మోక్షం" సంపాదించారు. సాధారణ శకం 1800(సిఇ) ప్రాంతంలో ఒక వైపు సంస్కరణవాదులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తూ ఉండగా, మరొక వైపు దొర స్వామ్యం' జీతగాళ్ల పెళ్ళాల్ని బలవంతంగా అనుభవించడం జరుగుతూ వచ్చింది. ఆనాటి పరిస్థితులను వర్ణించే కథల్లో స్త్రీలను కించపరిచే జుగుప్సాకరమైన ఆజ్ఞలు ఉండేవని తెలుస్తూ ఉంది. అలాంటి ఆజ్ఞలు ఆ కాలంలో వినిపిస్తూనే ఉండేవి. నమ్మినబంట్లు చేసుకొస్తూనే ఉండేవారు.

అలాంటి సాంఘిక పరిస్థితుల్లో పార్లమెంటుకు ఓటు వేసే హక్కును, విశ్వవిద్యాలయాల్లో విద్యనార్జించే అర్హత స్త్రీకి ఊహించలేమని ఆనాటి మేధావులు కొందరు ఆవేదన వెలిబుచ్చారు. పందొమ్మిదో శతాబ్దంలో రామ్మోహన్‌రారు లాంటి సంఘ సంస్కర్తలు స్త్రీ జనోద్ధరణకు పూనుకున్నారు. మహిళల స్థాయి పెంచడానికి, చట్టపరంగా వారికి కొన్ని హక్కులు సాధించి పెట్టడానికి, వారిని విజ్ఞావంతుల్ని చేయడానికి వారి కోసం ప్రత్యేకమైన పత్రికలు వెలువరించడానికి, వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి ఎంతో మంది పురుష సంఘసంస్కర్తలు కృషిచేశారు. కొంతకాలం తర్వాత విద్యావంతులైన మహిళలు దేశంలో తమ స్థితిగతుల్ని బేరీజు వేసుకుని తమ హక్కుల సాధనకు తామే నడుం బిగించారు. తమ సమస్యల్ని తామే గుర్తించుకుని, వాటికి పరిష్కారాలు తామే కనుగొనాల్సిన ఆవశ్యకతను అర్థం చేసుకున్నారు. ఫలితంగా 1904లో భారత మహిళాపరిషత్ ఏర్పాటైంది. ఇది 1887లో ప్రారంభమైన నేషనల్ సోషల్ కాన్ఫరెన్స్‌కు ఒక శాఖగా రూపొందింది. బాలికల విద్యగురించి ఎక్కువ శ్రద్ధ చూపింది.

భారత మహిళా పరిషత్, ఇతర మహిళా సమస్యల గూర్చి కూడా తీవ్రంగా చర్చించింది. 1916లో ప్రొఫెసర్ డి.కె. కార్వే పూనాలో మొట్ట మొదటి మహిళా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. దాదాపు అదే కాలంలో పండిత రమాబాయి 'ద హై కాస్ట్ హిందూ వుమెన్' (1888) ప్రకటించారు. స్వతహాగా సంస్కృత పండితురాలు కాబట్టి, వేదాల్ని చదివి, వాటి సారాంశాన్ని విశ్లేషించి చెప్పారు. పండిత రమాబాయి జీవితంలో ఎన్నో ఎదురు దెబ్బలు తింటూ, తోటి మహిళల అభ్యున్నతికి తన జీవితం ధారపోశారు. చివరికి 1889లో శారదా సదన్ ప్రారంభించారు. వితంతువులకు వృత్తి విద్యలు నేర్పడం, పాఠశాలలు నిర్వహించడం, ఉపాధ్యాయులకు శిక్షణ నివ్వడం మొదలైన పనులన్నీ 'శారదా సదన్' సంస్థ ద్వారా నిర్వహించారు. "బాల్యంలోనే వితంతువులైన వారు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగితే వారు, వారి జీవితాల్ని చక్కదిద్దు కోగలరు. మరొకరికి అండగా కూడా ఉండగలరు" అన్నది రమాబాయి ఉద్దేశం! 19వ శతాబ్దంలోనే మహిళలు పత్రికారంగంలో ప్రవేశించారు. ప్రత్యేకించి స్త్రీల పత్రికలు స్త్రీ గొంతుకలకు వేదికలయ్యాయి.

1913లో భారతీయ సాహిత్యానికి నోబెల్ పురస్కారం సాధించిన విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ సోదరి స్వర్ణకుమారీదేవి దేశంలోనే తొలి సంపాదకురాలయ్యారు. ఆమె వెలువరించిన తొలి మహిళల పత్రిక 'భారతి' 1884లో వెలువడింది. దాని తర్వాత 1301లో 'ఇండియన్ లేడీస్ మ్యాగజైన్' నాటి మద్రాసు నుంచి వెలువడింది. శ్రీమతి కమలా సత్యానందన్ సంపాదకులుగా, మేనేజర్‌గా వ్యవహరించారు. అప్పటికే ఆమె యం.ఎ. పట్టభద్రురాలు. అసిస్టెంట్ ఎడిటర్‌గా కుమారి పి.సత్యానందన్ పనిచేశారు. ఆమె బి.ఎ. పట్టభద్రురాలు. ఈ పత్రిక 1918 వరకు క్రమం తప్పకుండా వెలువడింది. ఏవో కారణాల వల్ల, మధ్యలో కొన్ని సంవత్సరాలు ఆగి, 1927 నుండి పునర్దర్శనమిచ్చింది. పత్రికల వల్ల మధ్యతరగతి గృహిణుల్లో చాలా చైతన్యం వచ్చింది. స్త్రీవిద్య, వితంతు పునరావాసం వంటి వాటి ప్రాముఖ్యాన్ని గ్రహిస్తూ వచ్చారు. క్రమక్రమంగా క్లబ్బులు, సంస్థలు, ప్రారంభమ య్యాయి. వాటివల్ల మహిళలు తరచూ కలుసుకుని, చర్చించుకునే అవకాశం కలిగింది. దొరోతి జినారాజ దాస, మార్గరెట్ కజిన్స్, అనిబిసెంట్ మొదలైన వారు పూనుకుని "ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్"ను నిర్వహించారు.

అసోసియేషన్‌కు ఒక పత్రిక ఉండడం చాలా అవసరమని గ్రహించి 'శ్రీ ధర్మ' పేరుతో పత్రిక ప్రచురించారు. ఈ పత్రిక మహిళల్లో రాజకీయ చైతన్యాన్ని కలిగించింది. ఇందులో అన్నికులాల వారికి, మతాల వారికి సభ్యత్వం ఇచ్చారు. స్త్రీలకు ఓటుహక్కు- ఉండాల్సిన అవసరాన్ని స్త్రీ ధర్మ' పత్రిక ద్వారా ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ నొక్కిచెప్పింది. ఇంకా ఈ అసోసియేషన్ తన ధ్యేయాల్ని ఈ విధంగా రూపొందించుకుని, ప్రచారం చేసుకుంది. 1. భారతమాతకు ప్రియమైన కూతుర్లం దరూ వారివారి బాధ్యతల్ని తెలుసుకోవాలి. 2. భార్యలుగా, తల్లులుగా బాధ్యతాయుతంగా నడుచుకుంటూనే కుటుంబ సభ్యులకు తగిన శిక్షణ ఇవ్వాలి. మరోవైపు భావిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దాలి. 3.పురుషులకు వలెనే స్త్రీలు కూడా ఓటు హక్కు సాధించుకోవాలి. గ్రామ పంచాయతీ స్థాయి నుండి పార్లమెంటు దాకా పోటీ చేయగల హక్కును సాధించుకోవాలి. 4. స్త్రీ విద్యకోసం ఎక్కువగా శ్రమిస్తూ, వివిధ మహిళా కమిటీలుగా ఏర్పడి, స్త్రీ జనాభ్యుదయానికి కావల్సిన ప్రణాళికలు రూపొందించుకుని, వాటికి కార్యరూపమివ్వాలి. మంచి కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన వారు కూడా ఈ అసోసియేషన్‌లో కార్యకర్తలై చిత్తశుద్ధితో పనిచేయడం వల్ల త్వరితగతిన ప్రగతి సాధించగలిగారు.

-సుప్రసిద్ధ సాహితీవేత్త,
జీవశాస్త్రవేత్త, డాక్టర్ దేవరాజు మహారాజు

# మున్సిపోల్స్‌కు కాంగ్రెస్ పార్టీలో కదనోత్సాహం

## సూర్యాపేటకు న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

ధర్మఘంట, జనవరి 02, సూర్యాపేట

మున్సిపాలిటీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధంగా వుండాలని, పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య లు అన్నారు. సూర్యాపేటకు న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అనే నినాదంతో ఎన్నికల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. సూర్యపేట మున్సిపాలిటీకి జరగబోయే ఎన్నికలపై జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో నాయకులకు అవగాహన సదస్సును శుక్రవారం నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటిలో కాంగ్రెస్ పార్టీ తరపున ఒక్కో వార్డుకు పది మంది చొప్పున పోటీ పడుతున్నారని కానీ అర్హులైన అభ్యర్థులకు అంకితభావంతో పనిచేసే వారికి పార్టీకి విదేయులైన వారికి, గెలుపు గుర్రాలకే టికెట్ ఇవ్వడం జరుగుతుందని వారు చెప్పారు. పార్టీ టికెట్ రాని వాళ్ళు టికెట్లు వచ్చిన అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయాలని పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీకి వ్యతిరేకంగా



పనిచేసిన వారిని పార్టీ నుంచి తొలగించడమే కాకుండా తిరిగి పార్టీలో చేర్చుకోవడం జరగదని వారు అన్నారు.. మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని, మున్సిపాలిటీ గెలుపును దివంగత నాయకులు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి అంకితం ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐకమత్యంతో పని చేయాలని ప్రతి వార్డులో కూడా వార్డులోని సీనియర్ సిటిజన్స్ ఉద్యోగస్తులు మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని గెలుపు దిశగా వ్యూహరచన చేయాలని చెప్పారు. వార్డులలో ఇప్పటికే ఓటర్ జాబితా సిద్ధంగా ఉందని ఓటర్ జాబితా పరిశీలించాలని ఓటర్ లిస్టులో పేరు ఉన్నవారు ఎక్కడెక్కడ ఉన్నారో తెలుసుకోవాలని అన్నారు.. ప్రతి ఒక్క ఓటరును కలిసి మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే విధంగా ప్రయత్నాలు చేయాలని చెప్పారు.. మున్సిపాలిటీ ఎన్నికల కోసం ప్రతి వార్డ్ లో కూడా కో ఆర్డినేటర్లను నియమిస్తామని, జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసయ్య ఆధ్వర్యంలో కోఆర్డినేటర్లు పనిచేస్తారని తెలియజేశారు. ఎక్కడ కూడా చిన్న పొరపాటు కూడా జరగకుండా పనిచేయాలని చిన్న చిన్న పొరపాట్లే పార్టీ మీద ఎక్కువగా ప్రభావాన్ని చూపిస్తాయని, కాబట్టి ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు..

ఈనెల 5వ తేదీ నుండి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అప్లికేషన్లు ఇస్తామని తెలియజేశారు. ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ వార్డులకు పోటీ చేసినట్లయితే వార్డుకు ఒక దరఖాస్తు సమర్పించాలని చెప్పారు. కాంగ్రెస్ లో చేరడానికి ఆసక్తిగా ఉన్న వారితో మాట్లాడి పార్టీలో చేర్పించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ పార్టీ యొక్క సోషల్ మీడియా విభాగాన్ని యాక్టివ్ గా ఉంచాలని సోషల్ మీడియా గ్రూపులను ఏర్పాటు చేసుకొని ప్రతి కార్యక్రమాన్ని కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని తెలియజేశారు. 2014 చాలా మంది టికెట్ రాని వాళ్ళు పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని ఈసారి అటువంటి సంఘటన జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు.

## కేఎల్ఆర్ బస్సు బోల్తాపై సమగ్ర విచారణ చేపట్టాలి

**గాయాల పాలైన విద్యార్థులను యాజమాన్యం ఆదుకోవాలి**

**మణుగూరు**




కె ఎల్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాల చెందిన బస్సు బోల్తా ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ.. మొండికుంట అడవిలో బస్సు బోల్తా పడిన సంఘటనపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులను అన్ని విధాలుగా కళాశాల యాజమాన్యం ఆదుకోవాలన్నారు. యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సంఘటనపై వారు స్పందిస్తూ కళాశాల యాజమాన్యం విద్యార్థుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని, 40 మంది విద్యార్థులు ఎక్కాల్సిన బస్సులో 60 మంది విద్యార్థులను ఎలా ఎక్కించారని వారు ప్రశ్నించారు. ఇద్దరు కూర్చోవాల్సిన సీట్లలో ముగ్గురు, నలుగురు విద్యార్థులను కూర్చోబెడుతూ విద్యార్థులను ఇబ్బందుల గురి చేస్తున్నారని అన్నారు. నిలబడి విద్యార్థులు ప్రయాణం చేయాల్సి వస్తుందని ఈ విషయంపై, యాజమాన్యం దృష్టికి అనేకసార్లు విద్యార్థులు తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. బస్సులకు ఫిట్నెస్ ఉందా లేదా దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం ఇంత జరుగుతున్న కనీసం వారిని పట్టించుకోలేదన్నారు దెబ్బలు తగిలిన విద్యార్థుల వైద్య ఖర్చులు మొత్తం కళాశాల యాజమాన్యం భరించాలని, దీనికి బాధ్యత యాజమాన్యం వహించాలని వారు డిమాండ్ చేశారు.

## పార్థీవ దేహనికి నివాళులర్పించిన ఏఎంసి చైర్మెన్ రాంబాబు





**ఇల్లందు**

ఇల్లందు మండలం, బోయితండా గ్రామ పంచాయితీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీరా జైరాం శుక్రవారం ఆకస్మిక మరణం చెందగా వారి పార్థీవ దేహనికి పూలమాల వేసి నివాళి అర్పించి శాసన సభ్యులు కోరం కనకయ్య ఆదేశానుసారం తక్షణ ఖర్చుల నిమిత్తం 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందచేసి, కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ పక్షాన అండగా ఉంటామని ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, పొలారం ఉప సర్పంచ్ చంద్రశేఖర్, బానోత్ రమేష్, బోడా రామ, బానోత్ శంకర్, ఇస్లావత్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి పంటకు యూరియ కొరత లేదు

**– సహాయ వ్యవసాయ సంచాలకులు బి. తాతారావు**



**గుండాల**

గుండాల మండలంలో యాసంగి పంటకు యూరియ కొరత లేదని మణుగూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బి. తాతారావు తెలిపారు. శుక్రవారం రోజున గుండాల మండల కేంద్రంలోని పి.ఎ.సి.ఎస్ సెంటర్ ని సందర్శించిన సందర్భంగా మాట్లాడుతూ.. యాసంగి సీజన్ కి ఎటువంటి యూరియ కొరత లేదని యాసంగి సీజన్ కి గాను అక్టోబర్ 2025 నుండి ప్రైవేట్ డీలర్స్ ద్వారా 10493 బ్యాగులు, పి.ఎ.సి.ఎస్ గుండాల ద్వారా 1508 బ్యాగుల యూరియ అందుబాటులో ఉంచి రైతులకు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రైవేట్ డీలర్స్ వద్ద 890 బ్యాగులు, పి.ఎ.సి.ఎస్ గుండాల వద్ద 1181 బ్యాగుల యూరియ అందుబాటులో ఉన్నదని, వీటి ధర ఒక్కంటికి 266.50 గా కలదని, అందువలన రైతులెవరు యూరియ గురించి దిగులు చెందకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుండాల మండల వ్యవసాయాధికారి సి.హెచ్. వెంకటరమణ, పి.ఎ.సి.ఎస్ గుండాల సి.ఈ.ఓ పి. రాంబాబు, ఏ.ఈ.ఓ లు వై.లెనిన్, ఎ.బాలరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సంవత్సరంలో.. కొత్త ఆశలు!

**సింగరేణి భవిష్యత్తుపై ప్రజలు ఎదురుచూపులు**

**తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మణుగూరు.. స్థానిక సంస్థలలో ఫలించిన కొత్త పొత్తులు**





**మణుగూరు**

కోటి ఆశలతో 2026 కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాం. పినపాక నియోజకవర్గంలో 2025 ఎన్నో తీపి, చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. గతం ఓ జ్ఞాపకం.. వర్తమానం.. అనుభూతి.. భవిష్యత్తుపై ఆసక్తి ఈ మూడింటి కలయిక జీవితం 2025 మాత్రం కొంతమందికి మధురానుభూతులు పంచితే, మరి కొందరిని చేతి జ్ఞాపకాలు మిగిల్చింది. పాత సంవత్సరానికి గుడ్ బై చెబుతూ ప్రతి సెకండ్ ఎంతో విలువైనదిగా పరిగణించి ముందుకు సాగాలని నవ తెలంగాణ కోరుకుంటున్నది. గడచిన ఏడాదిలో నియోజకవర్గంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్న, రాజకీయాలలో కూడా పెను మార్పులు చోటుచేసుకున్నాయి ఈ క్రమంలోనే జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో సిపిఎం, బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు భారీగానే విజయం సాధించారు. కాంగ్రెస్, సిపిఐ అధిక స్థానాలు కైవసం చేజిక్కించుకున్నది. అధికార కాంగ్రెస్ పార్టీ తొమ్మిది గ్రామపంచాయతీలో విజయం సాధించినది. టిఆర్ఎస్ రెండు గ్రామపంచాయతీల్లో, సిపిఐ రెండు గ్రామపంచాయతీలో విజయం సాధించాయి. సిపిఎం పోటీ చేసిన పగిడేరులో 612 ఓట్ల భారీ మెజార్టీతో కుంజ శ్రావణ్ కుమార్ రాజా గెలుపొందారు. సిపిఐ సమితి సింగారం ఉపసర్పంచి పదవి ఇవ్వలేదని కాంగ్రెస్ విమర్శించింది. సిఐటియు జిల్లా మహాసభలు నవంబర్ లో ఉత్తేజంగా జరిగినాయి. తక్కువ మెజార్టీతో, తక్కువ ఓట్లతో కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీలను కైవసం చేసుకున్నది అని టిఆర్ఎస్ విమర్శిస్తుంది.. గెలుపు మాదేనని అంటున్నది. పార్టీ గుర్తులపై జరిగే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలలో ముందంజలో ఉంటామని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి పోటీ ఎవరు లేరని శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ధీమ వ్యక్తం చేశారు. పినపాక నియోజకవర్గం కేంద్రమైన మణుగూరులో కేంద్రీకృతమైన బొగ్గు గనులు మూడు సంవత్సరాల మించి భవిష్యత్తు ఉండదని సింగరేణి కనుమరుగవుతుందని విస్తృత ప్రచారం జరిగింది. దానికి అగ్నికి ఆజ్యం పోసినట్లు సింగరేణి సి అండ్ ఎండి దసరా, దీపావళి సందర్భంగా కార్మికులకు ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ మణుగూరు ఓసి టు భవిష్యత్తు పై ఆసక్తికర విషయాలను వెల్లడించారు. మూడు సంవత్సరాల కన్నా మణుగూరు బొగ్గు గనులు మనుగడ సాగించలేవని అధికారులు వెల్లడించారు. సింగరేణి గనులను కార్పొరేట్ కంపెనీలకు కాంట్రాక్ట్ ఇవ్వకుండా సింగరేణికి ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు ఒత్తిడి తేవడంతో సింగరేణి బిడ్ వేసింది. కేవలం సింగరేణి, జెన్కో మాత్రమే పోటీలో పాల్గొన్నాయి. సింగరేణి కి రావాలని కార్మికులు ఈ ప్రాంత ప్రజలు ఉత్కంఠ పరంగా ఎదురు చూస్తున్నారు. జనవరి 9న సింగరేణి భవిష్యత్తు తేలిపోతుంది. జెన్కోకు దక్కినట్లయితే మణుగూరు సింగరేణి కనుమరుగయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అధికారులను కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తుంది. 55 సంవత్సరాలు విరాజిల్లిన సింగరేణి భూగర్భ గనులు, ఉపరితల గనులు ద్వారా అధిక ఉత్పత్తితో రికార్డులు సాధించిన మణుగూరు సింగరేణి కనుమరుగయ్యే ప్రమాదం దగ్గరలోనే ఉన్నది. ఉపరితల గనుల వలన ఉపాధి అవకాశాలు తక్కువ విధ్వంశాలు ఎక్కువ జరిగాయి. ఈ ప్రాంతంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు మరియు ఇతర వ్యాపార సంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి లోనయ్యాయి. అమ్మకాలు కొనుగోలు పడిపోయింది. కోట్లలో విలువ చేసే భవనాలు, భూములు లక్షలకు పడిపోయాయి. ఇప్పటికే సింగరేణి నెలవారి ఉత్పత్తి వార్షికోత్పాదకతలో తీవ్ర సంక్షోభంలో ఉన్నది. సింగరేణి సంస్థకు మణుగూరు ఓసి టు వేలంలో దక్కాలని ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు ఎదురు చూస్తున్నారు. సింగరేణి లేకుండా మణుగూరును, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఊహించుకోలేమని ప్రజలు, ప్రజా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలి

**శీతాకాలం అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయాలి**

**సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు**

**మణుగూరు**

సింగరేణి కాంటాక్ట్ కార్మికులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సదస్సులో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో కాంటాక్ట్ కార్మికులుగా పనిచేస్తూ ఏండ్ల తరబడి జీవనం కొనసాగిస్తున్నారని, కానీ వారికి లాభాల్లో వాటా గానీ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో సింగరేణి యాజమాన్యం పూర్తి వైఫల్యం చెందిందని వారన్నారు. కనీస వేతన చట్టం అమలు కావటం లేదని, ఈరోజు వాళ్లు వాళ్ల శ్రమలో నుంచి వచ్చే పీఎఫ్ తప్ప వారికి మరొక ఆదాయం లేదని, సింగరేణి యాజమాన్యం దీనిపై జోక్యం చేసుకొని వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని వారన్నారు. అనంతరం రిటైర్మెంట్ అయిన దేవుళ్ళ భద్రయ్య ను కార్మికులు సన్మానించారు. భవిష్యత్తులో ప్రభుత్వమే ఇటువంటి కార్యక్రమాలు చేయాలని, అప్పుడే వాళ్ళ శ్రమకి ఫలితం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు హిమంబి, ఆదిలక్ష్మి, శ్రీవాణి, నరసింహారావు, బుక్కొండ సమ్మన్న, బుక్య రాందాస్, సింగరేణి మాజీ నాయకులు, సిపిఎం పార్టీ ఆఫీస్ కార్యదర్శి గుర్రం నరసయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.



## గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బందికి

# నూతన సంవత్సర బహుమతుల పంపిణీ







**మణుగూరు**

గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా సుమారు 600 మంది విద్యార్థులకు మరియు సిబ్బందికి బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రేస్ క్యాంపస్ లో గ్రేస్ సంస్థల అధినేత పి. జాకబ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి జి. స్వర్ణ జ్యోతి హాజరై విద్యార్థులకు నూతన సంవత్సర బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, నూతన సంవత్సరాన్ని లక్ష్య సాధనతో ప్రారంభించాలని సూచించారు. ఇలాంటి ఉత్తమ కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రేస్ యాజమాన్యాన్ని ఆమె హృదయపూర్వకంగా అభినందించారు. ఇంకా ఆమె మాట్లాడుతూ.. "ప్రార్థించే పెదవుల కన్నా ఆదరించే చేతులే గొప్పవి" అని పేర్కొంటూ, పేద ప్రజలకు, విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ అందిస్తున్న సేవలు ఎనలేనివని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర అతిథులు మాట్లాడుతూ.. గ్రేస్ సర్వీస్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇలాగే నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తూ, తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు గ్రేస్ క్యాంపస్ ఇంచార్జ్ మాథ్యూ పుల్లారావు, గ్రేస్ మిషన్ స్కూల్ ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు, గ్రేస్ ఐటీఐ సిబ్బంది, విద్యార్థులు, గ్రేస్ సర్వీస్ సొసైటీ సభ్యులు జెట్టి స్వామి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ధర్మఘంట

# నేడు గోదావరి నది హారతి

## - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**కొత్తగూడెం**

భద్రాచలంలో నేడు అనగా తేది 03-01-2026 (పూర్ణిమ, శనివారం) నాడు సాయంత్రం 5:30 గంటల నుండి భద్రాచల క్షేత్రంలో గోదావరి నది హారతి కార్యక్రమం నిర్వహించబడుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, తెలిపారు. మన దేశంలో నదులు ప్రజల జీవనానికి ఆధారంగా నిలిచి, నాగరికత అభివృద్ధికి మూలాధారంగా పనిచేశాయి. తరతరాలుగా నదులు ప్రజల జీవన విధానం, సంస్కృతి మరియు పర్యావరణంతో ముడిపడి ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అటువంటి నదుల్లో దక్షిణ భారతదేశంలో ప్రవహించే ప్రధాన నది గోదావరి. చరిత్రాత్మకంగా మరియు సాంస్కృతికంగా విశిష్టత కలిగిన గోదావరి నది తీరప్రాంతాలు అనేక సంప్రదాయాలు, కథనాలకు కేంద్రంగా నిలిచాయి. భద్రాచలం ప్రాంతం కూడా




గోదావరి నదితో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉండి, కాలక్రమేణా ఒక ప్రముఖ సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన "ఏరు ది రివర్ ఫెస్టివల్" లో భాగంగా గత శనివారం నుండి గోదావరి నదికి నది హారతి కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నది హారతి కార్యక్రమాన్ని ఇకనుండి ప్రతి వారం భద్రాచలంలో నిర్వహించనున్నట్లు పౌరుల అభిప్రాయం మేరకు 03.01.2026 రోజున మరియు వచ్చే ప్రతి శనివారం నిర్వహించాలని పేర్కొన్నారు. భద్రాచలం ప్రాంతంలో ప్రవహించే గోదావరి నది ఔన్నత్యాన్ని ప్రజలకు మరింతగా తెలియజేయడంతో పాటు, నది ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడం మరియు పర్యావరణ పరిరక్షణకు ప్రజలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని, గోదావరి నది సంరక్షణ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# టెట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## - అభ్యర్థులకు పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెంల**

జిల్లాలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలక పరీక్షలుగా, పకడ్బందీగా, పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించబడతాయి కాబట్టి, అన్ని కేంద్రాల్లో కంప్యూటర్లు, సాంకేతిక సదుపాయాలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, పవర్ బ్యాకప్ మొదలైన ఏర్పాట్లు పూర్తిగా సిద్ధం చేయబడ్డాయి అని, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రతి కేంద్రంలో టెక్నికల్ సిబ్బందిను నియమించామని కలెక్టర్ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని, పరీక్ష సమయానికి పది నిమిషాలు ముందుగా గేట్లు మూసివేయబడతాయని అనంతరం ఎవరిని అనుమతించబోరని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఫోటో ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడి మొదలైనవి) తీసుకురావాలి అని నిషితంగా పరిశీలించిన



అనంతమే పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పూర్తిగా నిషేధించబడ్డాయని, అభ్యర్థులు తమ వెంట తీసుకువచ్చే వ్యక్తిగత సామాగ్రికి తాము పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ పరీక్ష విధానాన్ని ముందుగానే తెలుసుకోవాలి మరియు పరీక్ష ప్రారంభానికి ముందు సిబ్బంది ప్రశ్నాపత్రం విధానం, సమాధానాలు నమోదు చేసే పద్ధతిని వివరించనున్నారు. పరీక్ష సమయంలో అధికారుల సూచనలను పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాయాలని కలెక్టర్ కోరారు. పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ సమయాలు ఉదయం సెషన్‌కి 7.30 గంటల నుండి 8.50 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌కి 12.30 నుండి 1.50 గంటల వరకు ఉంటాయి మరియు ఉదయం సెషన్ అభ్యర్థులను 11.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ అభ్యర్థులను 4.30 గంటలకు మాత్రమే పరీక్ష పూర్తయిన తర్వాత బయటకు పంపుతారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందుగానే గుర్తించుకోవాలని, పరీక్ష పూర్తయ్యే వరకు ఎవరికీ బయటకు వెళ్ళడానికి అనుమతి ఉండదని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## కే ఎల్ ఆర్ కాలేజీ బస్ ప్రమాదంపై ఎమ్మెల్యే పాయం దిగ్భ్రాంతి వ్యక్తం

**బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని**

**ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు**

**అశ్వాపురం**



అశ్వాపురం మండలం, మొండికుంట ప్రాంతంలో పాల్వంచ సీతానగర్ కాలనీకి చెందిన కే ఎల్ ఆర్ కాలేజీ బస్సు బోల్తా పడిన ఘటనలో విద్యార్థులకు గాయాలు కాగా, ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాద ఘటనపై అసెంబ్లీ సమావేశాల నిమిత్తం హైదరాబాద్ లో ఉన్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వెంటనే స్పందించారు. సమావేశాల కారణంగా ప్రత్యక్షంగా సంఘటనా స్థలానికి రాలేకపోయినప్పటికీ, ఘటన వివరాలను తెలుసుకొని తక్షణ చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే పాయం సంబంధిత హాస్పిటల్ సూపరింటెండెంట్ ను ఫోన్ ద్వారా సంప్రదించి గాయపడిన విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే ఖమ్మం లేదా హైదరాబాద్‌కు తరలించాలని, వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని సంబంధిత వైద్య సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులను ఆదేశిస్తూ, గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం**




శుక్రవారం నాడు ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా శుక్రవారం సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# 14వ వార్డు ప్రజల ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం

**బూర్గంపహాడ్**

బూర్గంపాడు మండలం, సారపాక మేజర్ గ్రామ పంచాయతీకి జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్, 14వ వార్డు మెంబర్ కొమరం సావిత్రులను వార్డు ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షల మేరకు గ్రామ పంచాయతీని అన్ని వార్డులలో సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు పరిచేందుకు ప్రజల సహకారంతో ముందుకు వెళ్తానని ఆ మేరకు పని చేస్తానని అన్నారు. వార్డులో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుస్తానని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి చేరేవిధంగా అందిస్తామని హామీ





ఇచ్చారు. రాబోయే కాలంలో ప్రజా పరిపాలన అంటే ఎలా ఉండాలో చేసి చూపిస్తానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందిస్తూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో 14, 15 వార్డుల ఇన్చార్జి గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, బొడ్డు నాగరాజు, హెచ్ఆర్పిఎస్ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి వెంకటరెడ్డి, స్థానిక నాయకులు వెంకట రామిరెడ్డి, పగడాల మధుసూదన్ రెడ్డి, నవీన్, జరుపల వీరమ్మ, వార్డులో ఉన్న యువతీ యువకులు, మహిళలు, పురుషులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పిఆర్టియు టీఎస్ క్యాలెండర్ 2026 ఆవిష్కరణ



**టేకులపల్లి**

టేకులపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ అజ్మీర జగన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు టి. రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు జి. మోతిలాల్ నాయక్ పిఆర్టియు టిఎస్ క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్లో ఉన్న డి.ఎ పి.ఆర్.సి లను వెంటనే చెల్లించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పిఆర్టియు క్యాలెండర్ ఉద్యోగ ఉపాధ్యాయులకు చాలా ఉపయోగపడుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బి. రమేష్ బాబు, ఎం. రమణ , ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు, వెంకట్రామయ్య, లెనిన్ బాబు, ఆలీ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సీజన్ కావాల్సిన యూరియా అందుబాటులో ఉంది

**- నిర్దేశిత ధరలకే ఎరువులు విక్రయించాలి**

**- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు**




**టేకులపల్లి**




టేకులపల్లి శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయాన్ని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. సాగు సీజన్ దృష్ట్యా రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. గోదాములను ఉదయం 6 గంటలకే తెరిచి పంపిణీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 406 కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేస్తున్నామని ఈ సీజన్ కావలసిన యూరియా అందుబాటులో ఉందని రైతులు అపోహలు నమ్మొద్దని ఎవరైనా నిర్ణీత ధర కంటే ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ఎన్. అన్నపూర్ణ, ఏఈఓ శ్రావణి, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా సీటు బెల్ట్ పై అవగాహన కార్యక్రమం





**భద్రాచలం**



జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను పురస్కరించుకుని, భద్రాచలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో సీటు బెల్ట్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వాహనదారులకు సీటు బెల్ట్ ధరిస్తే వారి భద్రత పెరుగుతుంది. ప్రమాదాల బారిన పడకుండా ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు విధిగా సీటు బెల్ట్, హెల్మెట్ ఉపయోగించాలి అని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడుపుతున్న వారికి గులాబీ పూలను అందించి ప్రోత్సహించారు. రవాణా శాఖ సిబ్బంది, స్థానిక అధికారులు, వాహనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని సీటు బెల్ట్ మరియు హెల్మెట్ ఉపయోగించాలన్న అవగాహన పొందారు.